



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 313 | ఆదివారం 31 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# దేశ విద్యావ్యవస్థ నాశనం

- విశ్వగురువు అని ఉత్త ప్రగల్భాలే
- ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలే
- ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు
- దేశంలో మాఫియా చేతుల్లోకి విద్యావ్యవస్థ.. కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు

2




### ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన

# ఓటర్ల జాబితాలో సర్ ఒకటి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న వేళ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం - మిగతా 2లో..





### కర్ణాటక ముఖ్యమంత్రిగా

# డికె శివకుమార్

- సిఎల్‌పి నేతగా ఏకగ్రీవ ఎన్నిక
- 3న ప్రమాణస్వీకారం
- ఉపముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కుమారుడు

బెంగళూరు - సూర్య వాస్తవం

కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష (సిఎల్‌పి) నేత గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరులోని విధాన్‌సౌధలో శనివారం సాయంత్రం జరిగిన సిఎల్‌పి సమావేశంలో శివకుమార్ పేరును ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. పది నిమిషాల్లోనే ఈ సమావేశం ముగియడం విశేషం. సమావేశం అనంతరం సిద్ధరామయ్య, శివకుమార్‌తో కలిసి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడారు. - మిగతా 2లో..

# అమెరికాకు మోడీ దాసోహం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా ఒత్తిడి మేరకు పని చేస్తుందన్న విషయం మరోసారి స్పష్టమైంది. దేశంలో పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం రక్షణాత్మక సుంకాన్ని పూర్తిగా తొలగించేందుకు కేంద్రం సిద్ధమవుతోందని సమాచారం. దీంతో మోడీ సర్కారు తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయంతో అమెరికా సబ్సిడీ పత్తి భారత మార్కెట్‌ను ముంచెత్తే ముప్పు ఉంది. ఇది దేశీయ రైతులకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- భారత పత్తి రైతులు బలి
- యూఎస్ ఒత్తిడితో దిగుమతి సుంకం తొలగింపు!
- సిద్ధమవుతున్న కేంద్రం
- అమెరికా పత్తి భారత మార్కెట్‌ను ముంచెత్తే ప్రమాదం
- ఈ నిర్ణయంతో దేశ రైతులకు తీవ్ర నష్టం : నిపుణులు, విశ్లేషకులు
- మోడీ సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రస్తుతం భారత్‌లో పత్తి దిగుమతులపై 11 శాతం రక్షణాత్మక సుంకం అమలులో ఉంది. ఇప్పుడు దీనిని కూడా పూర్తిగా తొలగించేందుకు కేంద్రం సిద్ధపడటం వివాదాన్ని రాజేస్తున్నది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటన సమయంలో ఈ నిర్ణయం వెలుగులోకి రావడం గమనార్హం. దీంతో ఇది అమెరికా ఒత్తిడికి మోడీ సర్కారు లొంగిపోయిన చర్యగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడుతున్న వేళ, విదేశీ పత్తి దిగుమతులు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై అదనపు భారం పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**గతేడాది సుంకం తాత్కాలికంగా నిలిపివేత**

గతేడాది అమెరికా ఒత్తిడితో భారత్ పత్తి దిగుమతులపై ఉన్న 11 శాతం సుంకాన్ని అదే ఏడాది డిసెంబర్ వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పుడు దానిని పూర్తిగా తొలగించే దిశగా మోడీ సర్కారు అడుగులు వేస్తున్నట్టు



సమాచారం. భారత్ తన భారీ టెక్స్‌టైల్ పరిశ్రమ అవసరాల కోసం సుమారు 15 శాతం ముడిపత్తి, 20 శాతం యార్న్(నూలు)ను దిగుమతి చేసుకుంటోంది. సుంకం తొలగితే.. అమెరికా వంటి దేశాల నుంచి భారీ సబ్సిడీలతో వచ్చే చౌక పత్తి భారత మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశిస్తుంది. దీంతో ఇది అమెరికాకు ప్రయోజనాన్ని, భారత పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని - మిగతా 2లో..

# 7 నుంచి యోగాంధ్ర

- అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం :** జూన్ 7 నుంచి 14 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఆదేశించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ఎక్కడున్నా

# తెలుగుజాతి ఒక్కటే

- చర్చనీయాంశంగా టిడిపి ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్
- సీఎం చంద్రబాబునాయుడు
- టీడీపీ ముఖ్యనేతలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

అమరావతి - సూర్య వాస్తవం :



ఎక్కడున్నా తెలుగుజాతి ఒక్కటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి ముఖ్యనేతలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. మహానాడు కార్యక్రమంలో తెలంగాణ టిడిపి సీనియర్ నేత బక్కని నర్సింహులు చేసిన వాఖ్యలు సరికావని సిఎం అన్నారు. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదని చెప్పారు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తొలి సారి హైబ్రిడ్ విధానంలో జరిగిన మహానాడు ఘనంగా విజయవంతమైందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం లో భాగస్వాములైన నేతలు, కార్యకర్తలను అభినంధించారు. మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. - మిగతా 2లో..

# ఉచిత విద్యుత్ ఎత్తేయం..

- మోటార్లకు మీటర్లు పెట్టం
- అబద్ధాల పునాదుల మీద బతుకుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- చివరి గింజ వరకు కొనే బాధ్యత మాది
- కేంద్రం కొనకుంటే 15 తర్వాత మోడీ, కిషన్‌రెడ్డి సంగతి చెప్తా
- అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల్లో పోటీ చేయం
- మేం మాట మీద నిలబడితే బీఆర్ఎస్ పోటీ చేయకుండా ఉంటుందా?
- 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతు డిస్కం లక్ష్యం
- ధాన్యాన్ని వారి ఇండ్ల ముందే పోస్తాం : మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం :

ఉచిత విద్యుత్ ఎత్తేయం... మోటార్లకు మీటర్లు పెట్టబోమని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనికి భిన్నంగా తాము వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమని తేల్చిచెప్పారు. ఒకవేళ మోటార్లకు మీటర్లు పెట్టకపోయినా, ఉచిత విద్యుత్ కొనసాగించినా వచ్చే ఎన్నికల్లో పోటీ



నుంచి బీఆర్ఎస్ తప్పుకుంటుందా?అని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని బోధి పెవిలియన్‌లో మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గతంలో రాష్ట్రంలోని ఉత్తర, దక్ష?ణ డిస్కంలు జాతీయ ర్యాంకుల్లో మూడు, ఆరు స్థానాల్లో ఉండేవని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక క్రమశిక్ష?ణ లోపించడంతో 52, 54 స్థానాలకు పడిపోయాయని ఉదహరించారు. రెండు డిస్కంలు రూ.69,741 కోట్ల నష్టాల్లో ఉన్నాయని చెప్పారు. 24 గంటల ఉచిత విద్యుత్ అమలు చేశాక ప్రభుత్వాలు డిస్కంలకు నిధులు ఇవ్వట్లేదన్నారు. అందుకే దేశంలోనే మొదటి సారిగా రైతు డిస్కంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనివల్ల జవాబుదారీతనంతో 24 గంటల నాణ్యమైన - మిగతా 2లో..

## ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన
# ఓటర్ల జాబితాలో సర్ ఒకటి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన స ర్ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒకటనిఅభిప్రాయపడ్డారు. రేయింబవళ్లు ప్రతికూల ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ పూర్తి పారదర్శకతతో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నందుకు ఎన్నికల అధికారులను ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. “15 లక్షలకు పైగా బూత్ స్థాయి ఏజెంట్లు, అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల జిల్లా, రాష్ట్ర అధ్యక్షుల పర్యవేక్షణలో 11 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రూపొందిస్తున్నారు. ఈ సర్ ప్రక్రియలో పాల్గొన్న వారందరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. వారందరూ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒక దానిని తయారుచేయడానికి ఎన్నికల సంఘానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు” అని పేర్కొన్నారు.

## కర్ణాటక ముఖ్యమంత్రిగా
# డికె శివకుమార్

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభలో కాంగ్రెస్ సభా పక్ష నేతగా డికె శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా శివకుమార్ ప్రమాణం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ అధిష్టాన నేతల ఆధ్వర్యంలో అధికార మార్పు ప్రణాళికాయుతంగా సజావుగా సాగిందని చెప్పారు. అధిష్టాన నిర్ణయాలను అనుసరించి సిద్ధరామయ్య క్రమశిక్షణతో నిబద్ధత చాటారని ప్రశంసించారు. ఆయన అండతో శివకుమార్ నేతృత్వంలో 2028 లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వేణుగోపాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ పదవీ స్వీకార ప్రమాణోత్సవాన్ని తొలుత భారీగా నిర్వహించాలని ప్రణాళికలు వేసుకున్నా.. ఆఖరి నిమిషంలో నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర గవర్నరు కార్యాలయ భవనం ‘లోక్‌భవన్’లో జూన్ 3న నిరాడంబరంగా ఈ వేడుక నిర్వహించనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు జిసి చంద్రశేఖర్ ప్రకటించారు.

**గవర్నరుతో భేటీ**

సిఎల్‌పిగా ఎన్నికైన అనంతరం డికె శివకుమార్ లోక్‌భవన్‌కు వెళ్లి రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌తో సమావేశమయ్యారు. సిద్ధరామయ్య, ఇతర నాయకులతో కలిసి వెళ్లిన ఆయన రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిం చాల్సిందిగా కోరారు. ఇందుకు సంబంధించిన మద్దతుదారుల జాబితాను ఆయన అందజేశారు. అంకితభావంతో, నిజాయితీతో, సత్సంబంధాలతో రాష్ట్ర ప్రజలకు సేవ చేయడానికి తాము కట్టుబడి ఉన్నా మని ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో శివకుమార్ పోస్టు చేశారు. సిఎల్‌పి నేతగా తనను ఎన్నుకున్నం దుకు నేతలకు, సహచర ఎమ్మెల్యేలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**ఉపముఖ్యమంత్రిగా యతీంద్ర !**

సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కే అవకాశం ఉందని ఆపార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. ఇందుకు అధిష్టానం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

## ఎక్కడున్నా
# తెలుగుజాతి ఒక్కటే

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో కొంత సేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్ విభజన బిల్లులు కలిపే రావాలని సిఎం అన్నారు. ఆ రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. పునర్విభజన బిల్లు 2011 జనాభా లెక్కల ప్రకారం అయినా, తాజా జనాభా లెక్కల ప్రకారం అయినా రాష్ట్రానికి నష్టమే జరుగుతుందని అన్నారు. జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే న్యాయం జరుగుతుందని అన్నారు. దీనివల్ల ఎవరికీ నష్టం ఉండదని, పెంచిన స్థానాలు మహిళలకు కేటాయించవచ్చునని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా వీటిపై పట్టుదలతో ఉందని, చెప్పారు. టిడిపి ప్రకటించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇప్పుడు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతుందని చెప్పారు.

**నక్సలైట్లు, వైసీపీ ప్రజాస్వామ్యంలో పనికిరారు**

నక్సలైట్లతో పాటు వైసిపి కూడా ప్రజాస్వామ్యంలో పనికిరాదని చంద్రబాబు అన్నారు. నక్సలైట్లు తుపాకీతో రాజ్యాధికారాన్ని సాధించలేదని, అలాగే గొడ్డలితో వైసిపి ఎలా రాజకీయాలు చేస్తుందని ప్రశ్నించారు. వైసిపి గొడ్డలి పార్టీ అని ప్రజలు బాగా నమ్మారని తెలిపారు. వివేక హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉందని, ఈకేసు ఆమె పోరాటం వల్లే సజీవంగా ఉందన్నారు. వైఎస్ కుటుంబ అరాచకాలలో తనకు తెలియని విషయాలు కూడా ఇప్పుడు బయటకు వస్తున్నాయని చెప్పారు.

# 7 నుంచి యోగాంధ్ర

(మొదటిపేజీ తరువాయి)

యోగాంధ్ర–2026పై ముఖ్యమంత్రికి అధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని వెస్ట్ బైపాస్ రోడ్ నది బ్రిడ్జిపై యోగా డేను జూన్ 21న నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు యోగాంధ్ర నిర్వహణకు రూపొందించిన పోస్టరును సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్‌తో పాటు సిఎస్ సాయిప్రసాద్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాకు
# మోడీ దాసోహం

(మొదటిపేజీ తరువాయి)

నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం తమ పత్తి రైతులకు కోట్లాది డాలర్ల సబ్సిడీలు ఇస్తుండటంతో.. అక్కడి పత్తి ధరలు భారతీయ రైతుల ధరల కంటే చాలా తక్కువగా ఉంటాయని వారు చెప్తున్నారు.

**రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిన కేంద్రం నిర్ణయం**

దేశీయ పత్తి ధర (క్వింటాల్ కు ) రూ.6100గా ఉంది. అదే సమయంలో మధ్యస్థస్థాయి పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.7,710, పొడవైన ఫైబర్ పత్తికి రూ.8,110 గా నిర్ణయించారు. గతేడాది సుంకం తొలగించిన తర్వాత విదేశీ పత్తి ఒక్క బేలు రూ.5000–5100 మధ్య లభించింది. కానీ దీంతో మార్కెట్‌లో దేశీయ పత్తి ధరలు ఒక్కసారిగా పడిపోయి.. రైతులకు అధిక నష్టాలను మిగిల్చాయి. రైతు సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలూ చేపట్టాయి. విదేశీ రైతులకు భారత డబ్బు వెళ్లిపోతుండగా… భారతీయ రైతుల ఆదాయం తగ్గిపో తోందని వారు ఆరోపించారు. మరోవైపు టెక్స్‌టైల్ పరిశ్రమ మాత్రం చౌక ముడిసరుకు కోసం దిగుమతి సుంకం తొలగించాలని నిరంతర ఒత్తిడి తీసుకొస్తోంది. కేవ లం అమెరికా, పరిశ్రమలోని వ్యాపారుల ప్రయోజనాల కోస మే మోడీ సర్కారు పని చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**టారిఫ్ తొలగింపు తెలివి తక్కువ నిర్ణయం**

అయితే ఈ సుంకం కొనసాగినా.. పరిశ్రమకు పెద్ద ఇబ్బందులు రాలేదని విశ్లేషకులు చెప్తున్నారు. రూపాయి బలహీనత కారణంగా విదేశీ కొనుగోలుదారులకు ఇప్పటికే లాభం కలుగుతుండగా.. 2024–25లో పత్తి దిగుమతులు 77 శాతం పెరిగాయని గుర్తు చేస్తున్నారు. కాబట్టి ప్రస్తుత విధానం రైతులు, పరిశ్రమకు ప్రయోజనకరంగా పని చేయడంతో పాటు అటు ప్రభుత్వానికి కూడా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్తున్నారు. ఇలాంటి తరుణంలో సుంకం తొలగింపు తెలివితక్కువ చర్య అవుతుందని మోడీ సర్కారును హెచ్చరిస్తున్నారు.

**పత్తి ఉత్పత్తిలో 24 శాతం భారత్ నుంచే**

భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుగా ఉన్నది. ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 24 శాతం భారత్ నుంచే వస్తోంది. సుమారు 60 లక్షల మంది రైతులు పత్తి సాగుపై ఆధారపడగా.. నాలుగైదు కోట్ల మంది టెక్స్‌టైల్ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఈ రంగం దేశ జీడీపీలో 2.3, పారిశ్రామిక ఉత్పత్తిలో 13, ఎగుమతుల్లో 12 శాతం వాటా కలిగి ఉందని గణాంకాలు చెప్తున్నాయి.

**పత్తి ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం.. సంక్షోభంలోకి రైతులు**

దేశంలో పత్తిపై ఉన్న దిగుమతి సుంకాన్ని తొలగించొద్దని నిపుణులు, విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే సుంకాన్ని తొలగించడం కోసం మోడీ సర్కారు సిద్ధమవుతుండటంతో దేశీయ పత్తి ఉత్పత్తి క్రమంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చ రిస్తున్నారు. అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులు మరోసారి సంక్ష?ోభంలోకి వెళ్లే ముప్పు పొంచి ఉందని వివరిస్తున్నారు. భారీ సబ్సిడీలు పొందుతున్న అమెరికా రైతులతో భారతీయ రైతులు పోటీ పడలేని పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు.

దీర్ఘకాలంలో భారత టెక్స్‌టైల్ పరిశ్రమ విదేశీ పత్తిపై అధికంగా ఆధారపడే పరిస్థితి వస్తుందనీ, దాంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతుందని వారు కేంద్రాన్ని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే జన్యుమార్పిడి పత్తి విత్తనాలపై విదేశీ కంపెనీలకు భారత్ భారీగా రాయల్టీలు చెల్లిస్తున్న విషయాన్ని కూడా నిపుణులు, విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

# ఉచిత విద్యుత్ ఎత్తేయం..

(మొదటిపేజీ తరువాయి)

ఉచిత విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని ప్రకటించారు. క్రాస్ సబ్సిడీ ఇచ్చే 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మెట్రో వాటర్ వర్క్స్ వాటిని ఈ డిస్కం పరిధిలోకి తెస్తామన్నారు. అయితే రాత్రి పూట వ్యవసాయం చేసేది తక్కువ అనీ, ఉదయం పూటే ఎక్కువ మంది రైతులు విద్యుత్‌ను వాడుకుంటారని చెప్పారు. ఉదయం వేళల్లో తక్కువ ధరకు విద్యుత్ కొను గోలు చేసేందుకు అందుబాటులో ఉంటుందని వివరించారు.

2017 జూన్ 30న కేంద్ర ప్రభుత్వంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం రైతుల వద్ద మార్కులను కొట్టేయాలనే ఉద్దేశ్యంతోనే కేసీఆర్ మోటార్లు…మీటర్లు అంశాన్ని తెరపైకి తెచ్చారని చెప్పారు. తాము ఇప్పుడు కొత్తగా కేంద్రంతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని స్పష్టంచేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని అన్నారు. రాజ్యాంగం, చట్టాలున్నా ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ ఎలా ఉన్నాయో రైతుల కోసం కొత్త డిస్కం కూడా అలాగే ఉండబోతుందని వివరించారు. ఈఆర్సీ అనుమతి ఇవ్వగానే రైతు డిస్కం ఏర్పాటవుతుందని చెప్పారు. చత్తీస్‌ఘఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం ఒప్పందం చేసుకుని రెండు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేసినట్టు గత ప్రభుత్వం చెప్పిందనీ, ఇలాంటి అక్రమాలు, అడ్డగోలు నిర్ణయాలపై తాము సీబీఐ విచారణకు ఆదేశించామని తెలిపారు. దీనికోసం సీబీఐ డైరెక్టర్ అపాయింట్‌మెంట్ అడిగామనీ, ఆయన ఇవ్వట్లేదని చెప్పారు.

**బీఆర్ఎస్ డీఎన్ఏలోనే మోసం**

బీఆర్ఎస్ డీఎన్ఏలోనే మోసం, అబద్ధం ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, అధికారంలోకి వచ్చాక ఆ అబద్ధాలతోనే ఆ పార్టీ నాయకులు కొనసాగారని విమర్శించారు. ఇప్పుడు ఎవరిని మోసం చేస్తారని ప్రశ్నించారు. ఏం చేయాలో అర్థంకాక ఇప్పుడు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారనీ, క్రషర్లను బెదిరిస్తూ, రూ.50 లక్ష?లు ఇవ్వాలని డిమాండ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమంలో, పదేండ్లు అధికారంలో ఉండి దోచుకున్నారని చెప్పారు. ఈదురుకుంట చెరువు గురించి కేటీఆర్, హరీశ్‌రావు, నవీన్‌రావు మాట్లాడ్డం లేదన్నారు. గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ అనీ, 2019 ఇంటర్ ఫలితాల్లో అవకతవకలపై తాను పోరాడానని గుర్తు చేశారు.

**కేంద్రం ధాన్యం ఎలా కొనదో చూస్తా..**

వడ్లను తాము కొంటున్నది ఎంత, కేంద్రం కొంటున్నది ఎంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లెక్కలు తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీశారు.

వడ్లు, మొక్కజొన్న, జొన్నలకు మద్దతు ధర నిర్ణయిస్తే సరిపోదనీ, కొనుగోలు చేయాలని చెప్పారు. పంజాబ్‌కు 86 శాతం, చత్తీస్‌ఘడ్‌కు 68 శాతం, హర్యానాకు 65 శాతం ధాన్యం కొనుగోలు చేసి, తెలంగాణ నుంచి కేవలం 38 శాతం కొనాలని నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వడ్లు, మొక్కజొన్న, జొన్నలు మొత్తం కొంటామనీ, వాటిని తిరిగి కేంద్రం కొనకుంటే ఈనెల 15 తర్వాత ఆ సంగతేందో చూస్తానని హెచ్చరించారు. పంటల్ని కొనేందుకు నిరాకరిస్తే ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇండ్ల ముందు ఆ ధాన్యాన్ని పోస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామన్నారు. ఇప్పుడు బస్సులేసుకుని యాత్ర చేసే బీజేపీ నాయకుల ఇండ్లకు కూడా వెళ్తామన్నారు. ధరలు నిర్ణయించే కేంద్రానికి ధాన్యం కొనే బాధ్యత లేదా?అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 62 లక్ష?ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామనీ, చివరి గింజ వరకు కొంటామన్నారు. రైతులు కష్టంలో ఉంటే వారి వద్దకెళ్లి సెల్ఫీలు దిగి సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

**తుమ్మిడిహట్టిపై చర్చిస్తాం**

తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని సీఎం తెలిపారు. దీనికోసం ఆ రాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో చర్చలకు అపాయింట్‌మెంట్ అడిగామనీ, ఇంకా రాలేదన్నారు. సోమవారం ఆదిలాబాద్‌కు వెళ్తున్నానని చెప్పారు.

**కేటీఆర్ పేరు మార్చుకో..**

అంబేద్కర్, ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ రాజకీయాలకు అతీతమని రేవంత్‌రెడ్డి చెప్పారు. వారిని కులం, మతం, ప్రాంతం ఆధారంగా విభజించి చూడలేమన్నారు. వారు జాతిరత్నాలని అన్నారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని పువ్వాడ అజయ్ పెడితే బీఆర్ఎస్ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. అమీర్‌పేట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెడితే ఎందుకు రాజకీయం చేస్తున్నారని ప్రశ్నించారు. నంద్యాల నుంచి ఎంపీగా పనిచేసిన పీవీ నరసింహారావు విగ్రహం అక్కడ పెట్టాలని కేసీఆర్ ఏనాడైనా అడిగారా?అని అన్నారు. ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పీవీ విగ్రహం పెట్టిస్తామన్నారు. ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడే బీఆర్ఎస్ నాయకులు ముందు కల్వకుంట్ల తారక రామారావు పేరును మార్చుకోవాలని సూచించారు.

**జీహెచ్ఎంసీ ఎన్నికలపై తొందరేముంది**

రాష్ట్రంలో జనగణన, సర్ ప్రక్రియ జరుగుతోందని రేవంత్‌రెడ్డి చెప్పారు. అందుకే జీహెచ్ఎంసీ ఎన్నికలకు తొందరేముందని అభిప్రాయపడ్డారు. జూన్ 2న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామనీ, అయితే నామినీల కోసం ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు.

**అంబానీ, అదానీలకు పోటీ మా మహిళలే**

అంబానీ, అదానీలకు పోటీ మహిళలేనని రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కోసం అద్భుతమైన ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళా సమాఖ్యలకు గోదాములు, రైస్ మిల్లులు నిర్మించి ఇస్తామన్నారు.

**బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు పోటీ చేయరు**

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు పోటీ చేయబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలీదన్నారు. ఫ్యూచర్ సిటీని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. ఆయన ఎవరిని కలుస్తున్నారో పూర్తి సమాచారం తన వద్ద ఉందన్నారు. ఆ వివరాలు బయటపెడితే బాగుండదని చెప్పారు. 2008లో వైఎస్‌ను కలిశారని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరు అరెస్టు అయ్యేది కేంద్రం చేతుల్లో ఉందన్నారు.

**నాది, మహేష్‌గౌడ్‌ది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్**

తనది, పీసీసీ అధ్యక్ష?్షుడు మహేష్ గౌడ్‌ది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలతోపాటు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలిచిందని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తమ ఇద్దరి కాంబినేషన్‌లోనే వెళ్తామనీ, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు తానే సీఎంగా ఉంటానన్నారు.

# దేశ విద్యావ్యవస్థ నాశనం

**- విశ్వగురువు అని ఉత్త ప్రగల్భాలే**

**- ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలే**

**- ప్రధాని మోడీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు**

**- దేశంలో మాఫియా చేతుల్లోకి విద్యావ్యవస్థ ..**

**కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**

దేశ విద్యావ్యవస్థను ప్రధాని మోడీ పూర్తిగా నాశనం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఒకవైపు దేశాన్ని విశ్వగురువుగా చెప్పుకుంటున్న మోడీ సర్కార్, ఒక్క పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతోందని ఆరోపించారు. అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం భారతదేశ వ్యాప్తంగా ‘సీయూఈటీ–యూజీ 2026 పరీక్ష’ నిర్వహించారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొన్ని కేంద్రాల్లో పరీక్ష ఆలస్యమైందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీని ఉద్దేశించి రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. “నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్సీ, నేడు సీయూఈటీ. మొత్తం నాలుగు పరీక్షలు, ఒక కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్షను కూడా నిజాయితీగా నిర్వహించలేకపోయారు. తాము విశ్వగురువు అని ప్రగల్భాలు పలుకుతున్నారు. మొత్తం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారు. అయితే మీరు ఏ తరం భవిష్యత్తునైతే పాడు చేశారో, అదే తరం మిమ్మల్ని నిలదీస్తుంది. జవాబుదారీలను చేస్తుంది.” అని రాహుల్ అన్నారు.


**దేశానికి ఒక చదువుకున్న ప్రధాని కావాలి: కేజ్రీవాల్**

నీట్ పేపర్ లీక్ కావడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ విద్యావ్యవస్థ మాఫియా గుప్పెట్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రాలను పరీక్ష?ా కేంద్రాలకు తీసుకెళ్లేందుకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సహాయం తీసుకోనున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ పేపర్ లీక్ కారణాలు తెలుసుకునే ఉద్దేశం కేంద్రానికి లేదని, దానికి బదులుగా ఇలాంటి వింతైన పనులకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. అయితే దీనిని సరిదిద్దడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఏదో ఒకటి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కరుగా ఎవరూ ఏమీ చేయలేరని, అందరూ కలిస్తే ఏదైనా సాధ్యమేనని ఆయన అన్నారు. అదే సమయంలో దేశానికి చదువుకున్న ప్రధానమంత్రి అవసరం ఎంతైనా ఉందని, మోడీపై తనదైన స్టైల్లో సెటైర్ వేశారు.

## సంపాదకీయం

# అదానీ గుప్పెట్లోకే తిండి గింజలు

- ఆధునిక నిల్వ కేంద్రాల పేరుతో గుత్తాధిపత్యం
- రూ.9700కోట్ల సైలో ప్రాజెక్టు కట్టబెట్టిన మోడీ సర్కార్



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :**

పేదల నోళ్ళు కొట్టి, కార్పొరేట్ల జేబులు నింపాలన్న మోడీ సర్కార్ మంత్రాంగాలకు, చర్యలకు హద్దూ పద్దూ వుండడం లేదు. తాజాగా ఆ కోవలోకి చేరిందే భారత ఆహార సంస్థ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా–ఎఫ్‌సీ ఐ)కి చెందిన 'సైలో పథకం'. ఈ ప్రాజెక్టు వల్ల తలెత్తే పరిస్థితులు, ఇందులోని లోపాలు, లొసుగులపై స్వతంత్ర వార్తా సంస్థ 'న్యూస్ లాండ్రీ' ప్రత్యేక పరిశోధనాత్మక కథనాన్ని వెలువరించింది. ఆ కథనం ప్రకారం.. వాతావరణ మార్పులు కారణంగా, అలాగే ఎలుకలు, పురుగులు వంటి వాటి వల్ల ప్రతి ఏటా వేలాది టన్నుల ఆహార ధాన్యాలు వృధా అవుతున్నందున, వాటిని అరికట్టే సాకుతో మోడీ ప్రభుత్వం ఈ సైలో ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటివరకు ఎఫ్‌సీఐ దేశవ్యాప్తంగా తన గిడ్డంగుల్లో పాత పద్ధతిలోనే గోనె సంచుల్లో ధాన్యాన్ని నిల్వ వుంచుతోంది. ఇప్పుడు ఆ పద్ధతికి స్వస్తి చెప్పి వాటి స్థానంలో ఆధునికమైన స్టీల్ సైలోస్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం దాదాపు రూ.9700 కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రయి వేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో టెండర్లను ఆహ్వానించారు.

**కార్పొరేట్ గుత్తాధిపత్యానికి పట్టం**

అయితే, టెండర్లు పిలవడానికి ముందుగానే ప్రభుత్వం, ఎఫ్‌సిఐ టెండర్ నిబంధనల్లో వుండే కీలకమైన 'యాంటీ మొనోపొలీ (గుత్తాధిపత్య వ్యతిరేక) క్లాజ్‌ను తొలగించింది. ఇదే ఈ మొత్తం వ్యవహారంలో వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. యాంటీ కాన్‌సెంట్రేషన్ క్లాజ్‌గా కూడా పిలిచే ఈ నిబంధన ఈ టెండర్ల వ్యవహారానికి ఒక రక్షణ వలయంగా నిలిచేది. యాంటీ మొనోపొలీ నిబంధన ప్రకారం, దేశవ్యాప్తంగా ఒకే కంపెనీ లేదా సంస్థ రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో టెండర్లను దక్కించుకోరాదు. ఈ నిబంధనను అమలు చేయడం వల్ల మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీ వుంటుంది. పైగా చిన్న కంపెనీలకు కూడా టెండర్లు దక్కించుకునే అవకాశం వుంటుంది. అయితే మోడీ ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించింది. ఇటీవల ఎఫ్‌సిఐ జారీ చేసిన టెండర్ మార్గదర్శకాల్లో 'ఏకచ్ఛత్రాధిపత్య నిరోధక' నిబంధనను తొలగించడమో లేదా సడలించడమో జరిగింది. ఫలితంగా, అదానీ గ్రూప్ అయిన అదానీ అగ్రి లాజిస్టిక్స్ అత్యధికంగా లాభపడింది. టెండర్ నిబంధనలను మార్చిన తర్వాత జరిగిన వేలం పాటలో ఈ సంస్థ పలు రాష్ట్రాల్లో మెజారిటీ స్థాయిలో సైలో ప్రాజెక్టులను చేజిక్కించుకుంది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, వంటి ధాన్యం ప్రధానంగా పండించే రాష్టాల్లో అదానీదే ఆధిపత్యం. మొత్తంగా భారత ప్రభుత్వ గోదాముల్లో ధాన్యం నిల్వ సామర్థ్యంలో అదానీ గ్రూప్ వాటా భారీ స్థాయిలో పెరిగింది.

**ప్రధాన ఆందోళనలు**

తాజా పరిస్థితుల నేపథ్యంలో దేశ ఆహార భద్రతా రంగంపై గుత్తాధిపత్యం అంతా ఒక ప్రయివేట్ సంస్థ చేతుల్లోకి వెళుతోంది. దీనివల్ల భవిష్యత్తులో అత్యవసర పరిస్థితులు గనక నెలకొంటే అప్పుడు ప్రభుత్వం పూర్తిగా ఆ సంస్థపైనే ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇప్పటికే అదానీ గ్రూప్‌నకు దేశంలోనే భారీ స్థాయిలో ప్రయివేట్ ఓడరేవులు, రైల్వే లైన్లు, రవాణా నెట్‌వర్క్ వున్నాయి. తాజాగా ధాన్యం నిల్వ కేంద్రాలు కూడా వారి వశమవడంతో ఇక పంట పండడం దగ్గర నుంచి రవాణా, నిల్వ వరకు అన్ని స్థాయిల్లోనూ సరఫరా గొలుసు మొత్తంగా అదానీ గ్రూప్ చేతుల్లోనే వుండే పరిస్థితి తలెత్తుతుంది. ఇది పౌర, ఆర్థిక ప్రముఖులు, నిపుణులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రతిపక్షాల నుండి కూడా తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆ నివేదిక పేర్కొంది. మరోవైపు చిన్న కంపెనీలకు మనుగడ లేకుండా పోయింది. టెండర్ నిబంధనల్లో తీసుకువచ్చిన మార్పుతో ఆర్థికంగా పెద్దగా బలం లేని చిన్న కంపెనీలు, స్థానిక కంపెనీలు బిడ్డింగ్ నుండి తప్పుకోవాల్సి వచ్చింది.

**ఎఐకెఎస్ ఖండన**

తిండి గింజలు కూడా అదానీ గుప్పె ట్లోకి వెళ్ళేలా వ్యవహరించిన మోడీ సర్కార్ తీరును అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజ్జూ కృష్ణన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ గిడ్డంగులను కార్పొరేట్ సంస్థలు స్వాధీనం చేసుకోవడాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. వెంటనే యాంటీ మోనోపోలి నిబంధనను చేర్చాలని కోరారు. అలాగే సైలో సామర్థ్యల్లో కార్పొరేట్ గ్రూపుల వాటాలపై పరిమితిని విధించాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు చేయించాలని కోరారు. ప్రభుత్వ పెట్టుబడులతోనే ఎఫ్‌సీఐ నిల్వ సామర్థ్యలను పెంచాలని పేర్కొన్నారు. ఈ చర్యలన్నీ తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. దేశ ఆహార భద్రతా రంగాన్ని ఇలా కొల్లగొట్టడాన్ని వ్యతిరేకించాలంటూ రైతాంగానికి, వ్యవసాయ కార్మికులు, అన్ని ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు.

# ఇసుక తుపాను బీభత్సం

- రాజస్థాన్‌లో భీకర గాలులు, వెంటనే వడగండ్ల వాన
- పట్టపగలే కమ్ముకున్న చిమ్మచీకట్లు
- మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం: వాతావరణ కేంద్రం



**జైపూర్ – సూర్య వాస్తవం :**

రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోని చురు, శ్రీగంగానగర్, బికనీర్, సీకర్ తదితర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం భీకర ఇసుక తుపాను విరుచుకుపడింది. అనంతరం కుండపోత వర్షం ముంచెత్తింది. ఎడారి ప్రాంతంలో ఇసుక తుపాన్లు రావడం సహజమే అయినా, అది వచ్చిన కొద్ది నిమిషాలకే భారీ వర్షం కురవడం స్థానికులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. భీకర గాలులు వణికించాయి. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఈ వింత వాతావరణాన్ని 'హబూబ్' లేదా 'థండర్ స్టార్మ్ అవుట్‌ఫ్లో' అని పిలుస్తారని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. వేసవి తీవ్రతకు భూమి బాగా వేడెక్కినప్పుడు ఆకాశంలో భారీ ఉరుము మేఘాలు ఏర్పడతాయని, ఈ మేఘాల నుంచి వర్షం పడే ముందు, వాటిలోని అత్యంత చల్లని గాలి విపరీతమైన వేగంతో భూమి వైపు దూసుకొస్తుంది. ఈ చల్లని గాలులు నేలను తాకినప్పుడు, ఎడారిలోని పొడి ఇసుకను వందల అడుగుల ఎత్తుకు లేపడం వల్ల భారీ ఇసుక గోడలా ఏర్పడి, వర్షం కంటే ముందే తుపానులా దూసుకు పోతుందని వారు వివరిస్తున్నారు. ఇలా గాల్లోకి లేచిన ఇసుక రేణువులు మేఘాల్లోని నీటి ఆవిరి త్వరగా ఘనీభవించడానికి ఉత్ప్రేరకంగా సహాయపడతాయి. దీనివల్ల నీటి చుక్కల పరిమాణం వేగంగా పెరిగి, ఇసుక తుపాను వెనువెంటనే విపరీతమైన ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తుంది. ఈ ప్రక్రియ కారణంగానే రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో దుమ్ము, వర్షపు చుక్కలు కలిసి 'మట్టి వర్షం' కూడా కురిసిందని వాతావరణ నిపుణలు తెలిపారు. ఈ హఠాత్తు పరిణామంతో అటు ఇసుక తుపాను, ఇటు భారీ వర్షం ఒకేసారి ముంచెత్తడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రాష్ట్రంలోని చురు జిల్లాతో పాటు తారానగర్ తహసీల్, మెహరి గ్రామాల్లో ఈ తుపాను బీభత్సం స్పష్టంగా కనిపించింది. దట్టమైన మేఘాల రూపంలో ఇసుక ఆవరించడంతో మధ్యాహ్నం వేళలోనే ఒక్కసారిగా చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. సుమారు అరగంట పాటు ప్రజలు అంధకారంలో వణికిపోయారు. అంతకుముందు శుక్రవారం సాయంత్రం జైపూర్‌లోనూ ఇదే విధమైన వాతావరణం కనిపించగా, ధోల్‌పూర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జైపూర్ అగునా మొహల్లాలోని సంచియా మాతా ఆలయం ముందున్న శతాబ్దాల నాటి భారీ వేపచెట్టు వేళ్లతో సహా పెకలించుకుని రోడ్డుపై కూలిపోయింది. ప్రమాద సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది.

మరోవైపు ఈ భీకర ఇసుక తుపానుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. తుపాను తదనంతరం కురిసిన భారీ వర్షం కారణంగా రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి వాతావరణం చల్లబడింది. ఈ తరహా వాతావరణం మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం ఉందని జైపూర్‌లోని వాతావరణ కేంద్రం శనివారం వెల్లడించింది. జైపూర్, అజ్‌మేర్, బికనీర్, కోటా, జోధ్‌పూర్, భరత్‌పూర్, ఉదయ్‌పూర్ డివిజన్లలో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వడగళ్ల వాన పడే అవకాశం కూడా ఉందని, ప్రజలు వాతావరణ హెచ్చరికల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

# హర్మూజ్ నిర్వహణ హక్కు మాదే !

- అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదు !
- ఇరాన్ వెల్లడి



**టెహ్రాన్, వాషింగ్టన్ – సూర్య వాస్తవం :**

అమెరికాతో ఇంకా ఒప్పందమేదీ ఖరారు కాలేదని ఇరాన్ పేర్కొంది. అయితే ఉభయ పక్షాల మధ్య సందేశాల మార్పిడి మాత్రం కొనసాగుతోందని తెలిపింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి గల అవకాశాలపై మాట్లాడుతూ, భవిష్యత్తులో దీని నిర్వహణ కేవలం ఇరాన్, ఒమన్‌లకు సంబంధించేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్వహణలోని ఐరిబ్ టివికి ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె ఈ విషయాలు తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందానికి షరతులు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. చర్చల్లో తమ దృష్టి అంతా 'యుద్ధాన్ని ముగించడంపైనే' వుందని బాఘె పునరుద్ఘాటించారు. ఈ దశలో ఇరాన్ యురేనియం శుద్ధికి సంబంధించిన అంశాల వివరాలపై తాము ఎలాంటి చర్చలు జరపలేదని చెప్పారు.

**తమ డిమాండ్లు అంగీకరించాలంటున్న ట్రంప్**

ఇరాన్ తమ వద్ద ఎన్నటికీ అణ్వస్త్రం లేదా అణు బాంబు వుండదని అంగీకరించాలని ట్రంప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంతకుముందే ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. "హర్మూజ్ జలసంధిలో రెండు వైపులా రాకపోకలకు, నౌకల రవాణాకు ఎలాంటి ఆంక్షలు వుండరాదు, ఎలాంటి టోల్ ఫీజులు వసూలు చేయడానికి లేదు, తక్షణమే తెరవాలి." అని ట్రంప్ స్పష్టం చేశారు. జలసంధిలో పెట్టిన మందుపాతరలన్నీ తొలగించాలన్నారు. అప్పుడు మాత్రమే అమెరికా విధించిన నౌకా దిగ్బంధనాన్ని ఎత్తివేస్తుందని స్పష్టం చేశారు. ఇరాన్, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థల సమన్వయంతో అమెరికా, ఇరాన్ యురేనియం నిల్వలన్నింటినీ వెలికితీసి, నాశనం చేస్తుందని చెప్పారు. స్తంభింపచేసిన ఇరాన్ ఆస్తులను గురించి ప్రస్తావిస్తూ, తదుపరి నోటీసు జారీ చేసేవరకు ఇరాన్ డిమాండ్ చేసినట్లుగా ఎలాంటి డబ్బు మార్పిడి, ఆర్థిక నష్టపరిహారం జరగదన్నారు. గత కొద్ది వారాలుగా అమెరికా, ఇరాన్‌లు అనేక ప్రతిపాదనలపై చర్చలు జరిపాయి. యుద్ధాన్ని త్వరగా ముగించడానికి గల పరిస్థితులపై సవివరంగా చర్చించాయి. పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు సాగుతున్నాయి.

# వి. శ్రీనివాసరావు సేవలు అభినందనీయం: ఎస్పీ

## ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు సన్మానం



**అనంతపురం– సూర్య వాస్తవం**

అనంతపురం జిల్లా అదనపు ఎస్పీ వి.శ్రీనివాసరావు పదవీ విరమణ నేపథ్యంలో వీడ్కోలు సమావేశం శనివారం స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాలులో అత్యంత ఘనంగా జరిగింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన అదనపు ఎస్పీని దుశ్శాలువాతో కప్పి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా సన్మానించారు.


**ఎస్పీ ప్రశంసలు**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ, వి.శ్రీనివాసరావు తన సుదీర్ఘ సర్వీసులో అత్యంత ప్రతిభను, నిబద్ధతను కనబరిచారని కొనియాడారు. ముఖ్యంగా అనంతపురం అర్బన్ డీఎస్పీగా, ఆపై అదనపు ఎస్పీగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్ర అభినందనీయమన్నారు. పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, వారి విశ్రాంత జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు.

**సబ్ ఇన్‌స్పెక్టర్ నుండి అదనపు ఎస్పీ వరకు.. వి.శ్రీనివాసరావు సుదీర్ఘ ప్రస్థానం:**

**స్వస్థలం:** గుంటూరు జిల్లా.

**పోలీస్ సర్వీస్ ప్రారంభం:** వీరు 16-01-1989న సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు.



**విశిష్ట సేవలు - పదోన్నతులు:** తన విధి నిర్వహణలో చూపిన ప్రతిభతో సీఐగా, డీఎస్పీగా పదోన్నతులు పొందుతూ రాష్ట్రంలోని పలు కీలక ప్రాంతాలలో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

**అనంతపురం జిల్లాలో:** 24-09-2024న అనంతపురం అర్బన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వీరు అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది, అదే హోదాలో అత్యంత గౌరవప్రదంగా పదవీ విరమణ చేశారు.

ఈ కార్యక్రమంలో తాడిపత్రి సబ్ డివిజన్ రోహిత్ కుమార్ చౌదరి, ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విన్ మణిదీప్, ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా మరియు పలువురు డీఎస్పీలు, సి.ఐ లు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



**తాడిపత్రి –సూర్య వాస్తవం :** స్థానిక వైస్సార్సీపీ కార్యాలయంలో జరిగిన తాడిపత్రి రూరల్ మండల వైఎస్సార్సీపీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి మరియు ఎన్నికల సన్నద్ధతకు అత్యంత కీలకమైనది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన కేతిరెడ్డి పెద్దారెడ్డి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, తప్పులను సరిదిద్దడం. అర్హత కలిగిన యువతీ యువకులను ఓటర్లుగా చేర్పించడం. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పక్కాగా వెరిఫై చేయడం. పార్టీ విజయానికి పునాది అయిన బూత్ కమిటీలను మరింత క్రియాశీలకంగా మార్చడం. ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర చాలా కీలకం. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ఈ విధమైన సమీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అని కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు తో పాటు నాయకులు, కార్యకర్తలు కలిసి 2029లో వైస్సార్సీపీ ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## పీఏబీఆర్ డ్యామ్ వద్ద విషాదం

### - నీటి గుంతలో పడి తల్లి, కూతురు మృతి!



**ఉరవకొండ –సూర్య వాస్తవం:** విహారయాత్రకు వెళ్లిన ఆ కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. పీఏబీఆర్ డ్యామ్ సమీపంలో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి తల్లి, కూతురు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది.?అనంతపురం నగరంలోని అజాద్ నగర్ కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన 9 మంది సభ్యులు శనివారం పీఏబీఆర్ డ్యామ్ సమీపంలో విహారయాత్రకు వెళ్లారు. కౌకుంట్ల గ్రామం చివర ఉన్న డ్యామ్ వద్ద అందరూ కలిసి సరదాగా ఆడుకుంటున్న సమయంలో ఊహించని ప్రమాదం జరిగింది.?కుటుంబ సభ్యులలోని షేక్ ఫరీదా (35), ఆమె కుమార్తె షేక్ యాస్మిన్ (13)ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న లోతైన నీటి గుంతలో పడిపోయారు. వీరికి ఈత రాకపోవడంతో, నీటి నుంచి బయటకు రాలేక ఊపిరాడక అక్కడికక్కడే మరణించారు. కళ్ల ముందే ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ?మృతురాలి తల్లి షేక్ కుర్షీద్ భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉరవకొండ ఎస్సై జనార్ధన్ కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, దర్యాప్తు ప్రారంభించారు. పర్యాటక ప్రాంతాలు, ముఖ్యంగా జలాశయాల వద్దకు విహారయాత్రలకు వెళ్లే ప్రజలు నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి దిగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## సబ్సిడీ వేరుశనగ కాయల నమోదు ప్రక్రియ ప్రారంభం



**వేముల –సూర్య వాస్తవం :** వేముల మండలం లో సబ్సిడీ వేరుశనగ కాయల నమోదు ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు పేర్కొన్నారు. రోజు ఉదయం 10 గంటలకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు తెలిపారు.వేముల మండలానికి మొత్తం 260 క్వింటాళ్లు వేరుశనగ కాయలు మంజూరయ్యాయి అని తెలిపారు. వీటిని 40 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తామన్నారు. క్వింటాల్ పూర్తి ధర రూ.10200 కాగా సబ్సిడీ రూ4080 పోను రైతు వాటా రూ.6120 చెల్లించాల్సి ఉంటుందన్నారు ఒక్కో రైతుకు కనిష్టంగా 30 కిలోలు గరిష్టంగా 90 కిలోల కాయలు అందజేస్తామని తెలిపారు. మండలంలోని వేరు శనగ పంట సాగు చేసే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్ను సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని డబ్బులు చెల్లించాలని సూచించారు. ఈ నమోదు ప్రక్రియ పూర్తయిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


## ఆదమరిస్తే అంతే సంగతి



**పులివెందుల –సూర్య వాస్తవం:**మ్యాన్ హోల్ మూత పగిలిపోవడంతో వాహనదారులు పాదచారులు ఆదమరిస్తే అంతే సంగతులు అంటూ ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. పులివెందుల పట్టణంలోని పాత మసీదు దగ్గర చాగలేటి కాంప్లెక్స్ వీధిలో ఉన్న మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్ హోల్ మూత పగిలిపోవడంతో అటుగా వెళ్లే పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా రాత్రి వేళల్లో గోతిని గుర్తించలేక ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై కొత్త మూత ఏర్పాటు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ఆర్టీసీ కార్మిక ఉద్యమ నేతకు ఘన వీడ్కోలు

- అట్టహాసంగా పి.ఎస్.ఎన్. రావు పదవీ విరమణ వేడుకలు
- వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ
- సేవలను కొనియాడిన రాష్ట్ర నాయకులు , డిపో గౌరాధ్యక్షులు మధు సూదన్ రెడ్డి



**పులివెందుల –సూర్య వాస్తవం :** నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పి.ఎస్.ఎన్. రావు పదవీ విరమణ సందర్భంగా పులివెందుల ఆర్టీసీ డిపోలో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.డిపో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ నాయకుల సమక్షంలో అత్యంత వైభవంగా సాగింది. పదవీ విరమణ చేస్తున్న నాయకుడికి కార్మిక లోకం అందించిన అపూర్వ గౌరవానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్ నుంచి పులివెందుల ఆర్టీసీ బస్టాండ్ వరకు వేలాది మంది కార్మికులతో భారీ ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, జెండాలు, నినాదాలతో సాగిన ఈ ర్యాలీ పులివెందుల పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ మొత్తం కార్మికులు పి.ఎస్.ఎన్. రావుకు సంఘీభావం తెలుపుతూ ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి. రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి. శివారెడ్డి, పులివెందుల డిపో గౌరవ అధ్యక్షుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా, డిపో స్థాయి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి.ఎస్.ఎన్. రావు ఆర్టీసీ సంస్థలో నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. ఉద్యోగిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు కార్మిక సంఘ నాయకుడిగా వేలాది మంది ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆర్టీసీ సంస్థలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ తన నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.

కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉద్యోగ భద్రత, సేవా నియమాల అమలులో పి.ఎస్.ఎన్. రావు కీలక పాత్ర పోషించారని నాయకులు గుర్తుచేశారు. యూనియన్ కార్యకలాపాల్లో ఎల్లప్పుడూ చురుకుగా పాల్గొంటూ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన పేరు నిలిచిపోతుందని అన్నారు.

తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే కార్మికుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని అభిప్రాయపడ్డారు. ఆయన పదవీ విరమణ ఆర్టీసీ ఉద్యోగులకు, యూనియన్‌కు తీరని లోటని పేర్కొన్నారు.



అనంతరం పి.ఎస్.ఎన్. రావును శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు జ్ఞాపికలు అందించి ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు, కార్మికులు నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. సన్మానానికి స్పందించిన పి.ఎస్.ఎన్. రావు తన సేవా కాలంలో సహకరించిన యాజమాన్యానికి, యూనియన్ నాయకత్వానికి, తోటి ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం తన వంతు సేవలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, డిపో స్థాయి యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పులివెందుల ఆర్టీసీ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచే విధంగా ఈ పదవీ విరమణ వేడుకలు నిర్వహించబడినట్లు పలువురు అభిప్రాయపడ్డారు.

# గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా వైజిఆర్ ట్రస్ట్

- త్వరలోనే ఉచిత వైద్య శిబిరాలు
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అండగా వైజిఆర్ ట్రస్ట్
- త్వరలోనే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు
- ట్రస్ట్ సభ్యులు హరినాథ్ రెడ్డి, ఆదిత్యనాథ్ రెడ్డి



**సింహాద్రిపురం –సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఆర్థికంగా భరోసా కల్పిస్తూ వారి అభ్యున్నతికి ఎల్లవేళలా వై జి ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఆ ట్రస్ట్ సభ్యులు హరినాథ్ రెడ్డి, ఆదిత్య నాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సింహాదిపురంలోని జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వై జి ఆర్ ట్రస్ట్ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపించి మూడు సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందన్నారు . అయితే ఈ మూడు సంవత్సరాలలో పేద విద్యార్థులకు ఆర్థికంగా భరోసా కల్పిస్తూ వారికి అండగా నిలవడం జరిగి ందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ను ప్రోత్సహించడమే మా ట్రస్ట్ లక్ష్యం అన్నారు. నూరు శాతం అక్షరాస్యత సాధించడం,డిగ్రీ పూర్తి చేసిన వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం మా ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇప్పటివరకు మా ట్రస్ట్ ద్వారా ఐటీ, నాన్ ఐటీ రంగాలలో 60 కంటే ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు ఇంకా ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించడానికి మా ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు,ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ట్రస్ట్ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు విద్య, ఉద్యోగం, ఆరోగ్యం కల్పించడమే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 శారద, హెచ్ఎం సతీష్ బాబు, విజయ భాస్కర్ రెడ్డి ట్రస్టు సభ్యులు జవహర్ రెడ్డి, అంకిరెడ్డి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా డిస్సీ కాదు.. దగా డిఎస్సీ

**- రామగోపాల్ రెడ్డి స్థాయి తెలుసుకొని మాట్లాడితే మంచిది**



**పులివెందుల –సూర్య వాస్తవం:**

ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే దాదాపు 1.32 లక్షల సచివాలయ ఉద్యోగాలు పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదే అని,డీఎస్సీ పేరుతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుకున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే వైసీపీ పులివెందుల నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు జశ్వంత్ రెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు మారుతి రెడ్డి, మేధావుల సంఘం అధ్యక్షులు పద్మనాభ రెడ్డి, వెంకట రెడ్డి, వైసీపీ యూత్ నాయకులు మహీధర్, సాయి రాంగోపాల్ రెడ్డి పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పులివెందుల జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ...డీఎస్సీ మెరిట్ లిస్ట్ ను ఎందుకు ప్రభుత్వ వెబ్ సైట్లో పెట్టకుండా ఎంపికైన వారి మొబైల్ కు మెసేజ్ పంపించాల్సి వచ్చిందో రామగోపాల్ రెడ్డి సమాధానం చెప్పాలి,అదే విద్యాశాఖ లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్ అనే అభ్యర్థి కి ఎలా స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది రాంగోపాల్ సమాధానం చెప్పాలి. ఉద్యోగాల పేరిట ఒక్కో అభ్యర్థి నుంచి లక్షల్లో ముడుపులు పొంది కోట్లలో అక్రమార్జన చేసిన విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రామగోపాల్ రెడ్డి పదేపదే జగన్ మోహన్ రెడ్డి కుటుంబం మీద విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది,మొదట సాధారణ విలేఖరి స్థాయిలో ఉన్న నీకు ఇప్పుడు ఆంధ్ర , కర్ణాటక రాష్ట్రాల్లో వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి, అక్రమ సంపాదన రహస్యం ఏంటో ప్రజలకు చెప్పాలి,పులివెందుల ప్రాంతానికి లయోలా డిగ్రీ, పాలిటెక్నిక్, రాజారెడ్డి వైద్యశాల లాంటి ఎన్నో సంస్థలను నెలకొల్పిన రాజారెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని, తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే చందాన రాజారెడ్డి స్థాపించిన కళాశాల లో చదివి ఆయన స్థాపించిన వైద్యశాలలో వైద్యం పొంది స్వార్థ రాజకీయాల కోసం రాజారెడ్డి గురించి మాట్లాడే నీకు సిగ్గు శరం ఉందా,ఇకనైనా నీ అర్హత తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది అని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# విరమణ ప్రభుత్వ ఉద్యోగానికి మాత్రమే: తులసి రెడ్డి




**వేంపల్లె -సూర్య వాస్తవం :** పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగానికి మాత్రమే అని, పదవీ విరమణ తర్వాత సమాజానికి అనేక విధాల సేవ చేయవచ్చునని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శనివారం వేంపల్లి మధు రెడ్డి ఫంక్షన్ హాల్ లో వేంపల్లి గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ నాగభూషణ్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం అట్ట హాసంగా జరిగింది. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ నాగభూషణ్ రెడ్డి 43 సంవత్సరాల పాటు అటు విద్యారంగంలో,ఇటు పంచాయతీరాజ్ వ్యవస్థలో వివిధ హోదాలలో సమాజానికి సేవ చేశారన్నారు. కొందరికి పదవులు అలంకారమైతే మరికొందరు పదవులకే అలంకారం అవుతారు. ఆ విధంగా పదవులకే అలంకారం తెచ్చిన అధికారి నాగభూషణ్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయునిగా, ప్రధా నో పాధ్యాయునిగా, పంచాయతీ సెక్రటరీగా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్గా, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్గా ఏ హోదాలో, ఎక్కడ పని చేసినా సమర్ధ వంతంగా తన బాధ్యతలను నిర్వహిం చారన్నారు. వివిధ అంశాల పట్ల మంచి అవగాహన ఉన్న అధికారిఅని, మంచి భావవ్యక్తీకరణ కలదని, మంచి మోటివేటర్ అని తులసి రెడ్డి కొనియాడారు. శేష జీవితాన్ని ఒక మోటివేటర్ గా,ఒక సంఘ సేవకునిగా సార్ధకం చేసుకోవాలని తులసి రెడ్డి నాగభూషణ్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కుళ్లాయమ్మ,



పదవి విరమణ చేసిన జిల్లా స్పోర్ట్స్ అధికారి రామచంద్రారెడ్డి, డాక్టర్ బాషా, బాలస్వామి రెడ్డి, చక్రపాణి రెడ్డి, భోగరాజు, రాజారామ్, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చిన్న కోట్ల నాగరాజు, మనోజ్ కుమార్, నామా వినయ్, నాగభూషణ్ రెడ్డి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ,హితులు సన్నిహితులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ప్రతిభా విద్యార్థులకు మానవత సత్కారం "

## - విద్యార్థులను అభినందించిన సీఐ శ్రీరాం




**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చూపిన విద్యార్థులను మానవత సత్కరించింది .పులివెందుల మానవత సమావేశము స్థానిక గీతా మందిరములో శనివారము సంస్థ అధ్యక్షుడు జి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ ప్రతిభ కనపరచినవిద్యార్థులకు నగదు బహుమతులు, మేమెంటోలు, ఫైళ్లను అందజేశారు .595 మార్కులతో జిల్లా టాపర్ గా నిలిచిన కే .లక్ష్మీ వెంకటేశ్వర్లుకు (నాగుల గుట్టపల్లె) 5000 రూపాయలు ,558 మార్కులు సాధించి రెండో స్థానము పొందిన ఎన్ అక్షయ (రావుల కొలను)కు 3000 రూపాయలు ,587 మార్కులతో మూడో స్థానంలో ఉన్న వై పూజకు (వేంపల్లి )2000 రూపాయలు ,585 మార్కులతో నాలుగవ స్థానంలో ఉన్న కే తేజస్విని (వేముల) కి 1500నగదు బహుమతులను మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు చెవ్వ కృష్ణారెడ్డి తమ తండ్రి చవ్వా రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ నగదు బహుమతులకు ఆర్థిక సాయం అందించారు .ఈ సందర్భంగా సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ మానవత సమావేశానికి హాజరుకావడము ఆనందదాయకమన్నారు .దాత కృష్ణారెడ్డిని, విద్యార్థులను ,సిఐ అభినందించారు. సమావేశంలో అధ్యక్షుడు జి చంద్రశేఖర రెడ్డి ,అతిథులు శ్రీ తేరా పుల్లారెడ్డి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ,చైర్మన్ దేవిరెడ్డి కొండారెడ్డి ,జిల్లా కార్యవర్గ సభ్యులు చెవ్వ కృష్ణారెడ్డి, కోశాధికారి హరిచంద్రారెడ్డి సంస్థ కార్యకలాపాలు విధివిధానాలు సభ్యత్వ నమోదు తదితర అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి వి కృష్ణారెడ్డి ,రాజేశ్వరరెడ్డి ,సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ శ్రీనివాసులు , కే సి వి సుబ్బారెడ్డి ,జి కృష్ణారెడ్డి సత్కారము పొందిన విద్యార్థులు కూడా మాట్లాడారు. సమావేశానికి విచ్చేసిన సభ్యులకు రిటైర్డ్ ఎంఈఓ వెన్నపూస శ్రీనివాసులురెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ వారి కుటుంబ సభ్యులు వితరణగా అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై తిమోతి తో పాటు పలువురు మానవత సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని సమావేశమును జయప్రదము చేశారు.

# జగన్ హయాంలో విద్యావ్యవస్థ రాజకీయ రంగుతో మలినం

## - కార్పొరేట్ వ్యవస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
## - రాజకీయ ప్రయోజనాల కోసం బోడే రామచంద్ర యాదవ్ మాటలు సరికాదు
## - కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం :**

జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైకాపా హయాంలో విద్యావ్యవస్థ రాజకీయ రంగు పులుముకుని మలినం కాబడిందని, నారా లోకేష్ హయంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమైనదని, విద్యార్థుల ఉత్తమ ఫలితాలపై రాజకీయ స్వప్రయోజనాల కోసం బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ మాటలు సరికాదని కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులువిజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందుల తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన టువంటి సమావేశంలో విజయ్ కుమార్ రెడ్డి బోడె రామచంద్ర యాదవ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జగన్ మోహన్ రెడ్డి మాదిరిగా ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగత ఇమేజ్ ని సొంతం చేసుకునే విధంగా ప్రభుత్వం అందించే బ్యాగులు పుస్తకాలు మరియు బూట్లు తదితర వస్తువులపై జగన్మోహన్ రెడ్డి బ్రాండ్ ను ముద్రించుకునే ప్రభుత్వం తెదేపాది కాదని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు ఆధుని కతతో కూడిన విద్యను అందించేందుకు నైపుణ్యాల అభివృద్ధి తద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాతో పాఠశాలను తీర్చిదిద్దడం, ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే నేడు ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని వీటన్నింటిని వక్రీకరిస్తూ మలినం చేయడం సరికాదని, తెదేపాయంలోనే బీసీల అభివృద్ధి సాధ్యమైందని నిత్య సత్యమని, జగన్మోహన్ రెడ్డి హయాంలో మరియు ప్రస్తుత టిడిపి హయాంలో విద్యా వ్యవస్థలో వచ్చిన పరిణామాలను సమీక్షించి మాట్లాడాలని అలా కాకుండా తన వ్యక్తిగత సుప్రయోజనాల కోసం నిందలు సరికాదని, రామచంద్ర యాదవ్ గారికి నిజంగా సంక్షేమాన్ని ఆశించే వాడే అయితే పుట్టపర్తి సాయిబాబా అందించే ఉచిత విద్య విధానాలలో మాదిరిగా విద్యా వ్యవస్థలను నిర్మించాలని అలా కాకుండా ప్రభుత్వంపై మరియు నారా లోకేష్ విధానాలపై విమర్శలు చేస్తే సహించబోమని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

# బొమ్మేపల్లి నరసింహారెడ్డిని పరామర్శించిన నర్రెడ్డి తులసి రెడ్డి



**వీరపునాయునిపల్లి - సూర్య వాస్తవం :** కడప జిల్లా వీరపునాయుని పల్లి మండలం,కదిరేపల్లి గ్రామానికి చెందిన బొమ్మేపల్లి నరసింహారెడ్డికి ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో కుడి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. తిరుపతిలోని అమర్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని ఇటీవలనే ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ కదిరేపల్లిలో నరసింహారెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో వారి సాధకబాదకాలపై తులసి రెడ్డి చర్చించారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని రైతులు తులసి రెడ్డికి చెప్పారు. బొమ్మేపల్లి ప్రసాద్ రెడ్డి, వర్దిరెడ్డి వెంకటరామిరెడ్డి, కల్లూరు రఘునాథరెడ్డి తదితర రైతులు తులసి రెడ్డితో చర్చించారు. రైతాంగ సమస్యలపై మాట్లాడవలసిందిగా వారు తులసి రెడ్డిని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



**వేంపల్లె -సూర్య వాస్తవం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎఇఓ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుప్పాలపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడి పండుగ కార్యక్రమం చేపట్టారు. తల్లిదండ్రులకు, పాఠశాల కమిటీ సభ్యులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇఓ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కుప్పాలపల్లెలోని ప్రాథమిక పాఠశాలలో వంద శాతం విద్యార్థులను చేర్పించడం సంతోషకరమని చెప్పారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు డ్వాక్రా, అంగన్వాడీ, ఉపాధ్యాయులు కృషి ఉండడం అభినందనీయం అన్నారు. ప్రయివేటు పాఠశాలలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో కూడ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫారం, నోట్ పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, తాళ్లపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్ భవాని, ఉపాధ్యాయురాలు శివ జ్యోతి, డ్వాక్రా మహిళలు, పాఠశాల కమిటి సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'సర్ఐ ఆర్' హెల్ప్ డెస్క్ ప్రారంభించిన డాక్టర్ హుస్సేనీ

**రాయచోటి-సూర్య వాస్తవం:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టబోయే ఎస్ ఐ ఆర్ ప్రక్రియతో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు 'సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ సర్కారీ షర్ఫుద్దీన్ సోదరుడు డాక్టర్ సాక్ హుసేని అన్నారు. శనివారం స్థానిక ట్రంక్ రోడ్డు లోని సర్కాజీ ఇంటి పక్కన ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్ నీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం అనౌన్స్ చేసిన 16 రాష్ట్రాలు మూడు కేంద్ర పాలిత ప్రాంతంలో వచ్చే నెలలో ఎస్ఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అందులో భాగంగా ప్రజలకు కావాల్సిన పత్రాలు వారు భద్రపరచుకోవాల్సిన పత్రాల గురించి ఏ ఏ అవసరం ఉంటాయో ప్రజలకు సూచించి 2002వ సంవత్సరంలో వాళ్ళ తల్లిదండ్రులు తాత నానమ్మ వాళ్ళ పూర్తి వివరాలు తీసి సహారా వెల్ఫేర్ సొసైటీ వారు ఇవ్వడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఓటర్ కార్డులు అక్షర దోషాలు లేకుండా చిరునామా మార్పు, చేర్పు విషయంలో గానీ తేడా లేకుండా ప్రతి ఒక్కరు ముందుగానే హెల్ప్ డెస్క్ కి వచ్చి సరి చేసుకోవాలన్నారు. నిరక్షరాస్యులు, అక్షరాస్యులు, ఏమి తెలియని అమాయ పౌరుల కోసం, వారి హక్కుల కోసం, ఎస్ ఐ ఆర్ హెల్ప్ డ్రెస్ కోసం 10 కంప్యూటర్లు సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ హెల్ప్ డెస్క్ నీ అందరు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమానికి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు షరీఫ్, సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అఫ్తాబ్, అత్తర్ అజిదుర్ రహిమాన్, సహారా వెల్ఫే సొసైటీ గౌరవ అధ్యక్షులు నిజాంఖాన్, తదితరులు పాల్గొన్నారు.



## పిడుగుపాటుతో మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

### - బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



**నాయుడుపేట-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కారుమంచివారి కండ్రిగ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందిన తొప్పాని రవికుమార్ కుటుంబ సభ్యులను సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య శనివారం పరామర్శించారు. మృతుడు రవికుమార్ కుమారుడు యశ్వంత్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషాద ఘటన పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి నాగిరెడ్డి లక్ష్మీ ప్రసన్నకుమార్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు పాలేటి నాగార్జున, వైసీపీ నాయకుడు నెల్లూరు వంశీ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా బాధిత కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ, మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని కోరారు.

## రాఘవేంద్ర నగర్‌లో ఆపరేషన్ క్లీన్ స్వీప్

### - వైనాగేశ్వరరావు, డీసీఎంస్ చైర్మన్

### జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్రఅధ్యక్షులు



**కర్నూల్ -సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వారిలో నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఎమ్మెల్యే గౌరీ చరితా రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం లో భాగంగా కర్నూలు జిల్లా కల్లూరు మండలం రాఘవేంద్ర నగర్ లో వార్డ్ టీడీపీ ఇంచార్జి శైలజ యాదవ్ మరియు సచివాలయం సిబ్బంది తో కలిసి వై. నాగేశ్వరరావు యాదవ్ రోడ్లు,కాలవలు, టాయిలెట్ లను నాలుగు రోజుల డ్రైవ్ ద్వారా పూర్తి స్థాయిలో క్లీన్ చేస్తున్నామని తెలిపారు. ఒక్క కర్నూలు జిల్లాలో రోజుకు 220 టన్ను చెత్త ఉత్పత్తి అవుతుందని. ఈ వెస్టెజ్ ని జిల్లా యంత్రాంగం వీటిని డంప్ యార్డ్ లో మూడు భాగాలుగా క్లీన్ చేయిస్తున్నారు అని తెలిపారు. జిల్లాలో ఈ వేస్ట్, ప్లాస్టిక్ ఎక్కువగా ఉంటుందని వాటిని ఏజన్సీ ద్వారా క్లీన్ చేయిస్తున్నారని, జిల్లా ప్రజలు కూడా జిల్లాను పూర్తిగా శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ప్రజలు బయట చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాల్లో చెత్తను వేయాలని పిలుపునిచ్చారు.

## టీబీ నిర్మూలనకు ముందడుగు

### - హులికెర పంచాయతీ పరిధిలో

### మూడు గ్రామాల్లో చెస్ట్ ఎక్సరే శిబిరాలు

**కణేకల్ -సూర్య వాస్తవం:** కణేకల్ మండలం హులికెర గ్రామ పంచాయతీ పరిధిలోని పూలచర్ల, గోపులపురం, పుల్లంపల్లి గ్రామాల్లో "టీబీ ముక్త భారత్ అభియాన్ 2.0" కార్యక్రమాన్ని వైద్యులు డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ సౌందర్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌హెల్డ్ డిజిటల్ చెస్ట్ ఎక్సరే పరీక్షలు నిర్వహించి, క్షయవ్యాధిని (టీబీ) ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమంలో మొదటి రోజు పూలచర్ల గ్రామంలో 95 మందికి, రెండవ రోజు గోపులపురంలో 108 మందికి, మూడవ రోజు పుల్లంపల్లిలో 82 మందికి చెస్ట్ ఎక్సరేలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ కోసం నివేదికలను పంపించారు. 2030 నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వైద్యులు తెలిపారు. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా వినియోగించే వారు, పరిశ్రమల్లో దుమ్ము, ధూళి మధ్య పనిచేసే కార్మికులకు ఇటువంటి పరీక్షలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పూలచర్ల, గోపులపురం, పుల్లంపల్లి గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా వినియోగించుకున్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్‌ను మరిన్ని గ్రామాల్లో నిర్వహించి ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్వైజర్ ఎం.కే. సత్యనారాయణ, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్వైజర్ జె. అశోక్, హెల్త్ సూపర్వైజర్ బి. నరసింహులు, ఎంఎల్‌హెచ్‌పీలు ఎం. యమునాబాయి, బి. సుశీల, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు త్రివేణి, తిప్పమ్మ, లక్ష్మి, రత్నక్క, మంజుల తదితరులు పాల్గొన్నారు.



- డాక్టర్ సల్మాన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి.. సిపిఎం డిమాండ్
- రోగులతో దురుసు ప్రవర్తన చేసిన డాక్టర్ సల్మాన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సల్మాన్ తీరుపై భగ్గుమన్న సిపిఎం
- డాక్టర్ సల్మాన్ దౌర్జన్యానికి నిరసనగా సిపిఎం ధర్నా
- గుంటకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సల్మాన్ వ్యవహారంపై ఆందోళన
- వైద్య సేవల పేరుతో దురుసు వైఖరి.. డాక్టర్ సల్మాన్‌పై సిపిఎం ఫైర్
- రోగుల గౌరవాన్ని కాపాడాలని సిపిఎం గర్జన.. డాక్టర్ సల్మాన్‌పై చర్యలు కోరుతూ నిరసన
- గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట పేషంట్లు బంధువులు, సిపిఎం నాయకులు ధర్నా.. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం

## గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో

# వైద్యుల సేవపై ప్రజల ఆందోళన





**గుంతకల్లు- సూర్య వాస్తవం:** గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సల్మాన్ రోగులతో అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ సిపిఎం నాయకులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సంబంధిత వైద్యుడిపై వెంటనే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి.పి.ఎస్ నాయకుడు రాము నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు చివరి ఆశ్రయంగా ఉంటాయని, అక్కడికి వచ్చే ప్రతి రోగి గౌరవప్రదమైన వైద్య సేవలు పొందే హక్కు కలిగి ఉన్నాడని అన్నారు. అయితే కొందరు వైద్యులు తమ బాధ్యతలను విస్మరించి రోగులతో దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని పేర్కొన్నారు. డాక్టర్ సల్మాన్ మహిళా రోగులతో సైతం అనుచితంగా మాట్లాడుతున్నారనే ఫిర్యాదులు తమ వద్దకు వస్తున్నాయని, వృద్ధులను సైతం గౌరవించకుండా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనదని, రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతి వైద్యుడిపై ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలు తమ ఆరోగ్య సమస్యలు పరిష్కారవ ంవుతాయనే నమ్మకంతో వస్తారని, అలాంటి చోట రోగులు అవమానాలకు గురికావడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా పలువురు రోగులు ఇదే తరహా ఫిర్యాదులు చేశారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల సమస్య మరింత తీవ్రమైందని విమర్శించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు, ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని కోరారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం దెబ్బతినకుండా అధికారులు వెంటనే స్పందించాలని, లేకపోతే మరింత ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం నాయకులు మారుతి ప్రసాద్, సాకే నాగరాజు, జగల్లి రమేష్, సురేంద్ర, తిమ్మప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి ఎదుట జరిగిన ఈ ఆందోళన స్థానికంగా చర్చనీ యాంశమైంది.

## ఏపీపీజీ సెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంక్ సాధించిన చెన్నూరు ఆణిముత్యం



**చెన్నూరు-సూర్య వాస్తవం:** విద్య పట్ల అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెన్నూరు పట్టణానికి చెందిన విద్యార్థిని షేక్ రిహానా పర్విన్ నిరూపించింది. ఇటీవల నిర్వహించిన ఏపీపీజీ సెట్ పరీక్షలో 100 మార్కులకు గాను 99 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్‌ను కైవసం చేసుకుని చెన్నూరు పట్టణానికి గర్వకారణంగా నిలిచింది. చెన్నూరు పట్టణంలోని ముస్లిం కాలనీకి చెందిన షేక్ చాంద్ భాషా -- పాపాభాయి దంపతుల కుమార్తె అయిన రిహానా పర్విన్, ఈ నెల 11వ తేదీన నిర్వహించిన పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించడం విశేషం. ఆమె సాధించిన ఈ ఘన విజయం కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజల్లోనూ ఆనందాన్ని నింపింది. రిహానా విజయంపై ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి చూపిన తమ కుమార్తె రాత్రింబవళ్లు కష్టపడి చదవడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రిహానా పర్విన్ మాట్లాడుతూ, "నా తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగాను. ఇంకా బాగా చదివి ఉన్నత విద్యను అభ్యసించి నా తల్లిదండ్రులకు, గురువులకు, చెన్నూరు పట్టణానికి మంచి పేరు తీసుకురావడమే నా లక్ష్యం" అని తెలిపింది. రాష్ట్ర ప్రథమ ర్యాంక్ సాధించిన రిహానా పర్విన్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. చెన్నూరు వంటి పట్టణం నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రిహానా పర్విన్ సాధించిన ఈ విజయం చెన్నూరు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవడంతో పాటు, పట్టుదలతో కృషి చేస్తే విజయాలు సాధించడం సాధ్యమేనని మరోసారి చాటిచెప్పింది. రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించి చెన్నూరు పేరు ప్రతిష్టలను మరింత పెంచిన ఈ ఆణిముత్యానికి అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో క్లీన్ స్వీప్



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గుత్తి మున్సిపాలిటీ లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో క్లీన్ స్వీప్ కా ర్యక్రమంను చేపట్టడమైనది. రెండవ వారపు కార్యక్రమంగా ఈనెల 28 నుండి జూన్ 3వ తేదీ వరకు పెద్ద కాలువలు మ రియు మధ్యగతి కాలువల యందు పూర్తి పారిశుధ్య ప నులను నిర్దేదిత లక్ష్యముగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టడ మైనదని కమీషనర్ బి.జబ్బార్ మియా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు,ప్రజా ప్రతి ని ధులకు,ఎన్.జి.ఓ లకు,మీడి యా వారికి విజ్ఞప్తిగా మున్సి పాలిటీ వారు అత్యంత ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన క్లీన్ స్వీప్ కార్యక్రమంను విజయవంతం చేయుటలో అందరూ సహక రించాలని కమీషనర్ బి.జ బ్బార్ మియా పిలుపు నిచ్చా రు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ బా షా,శానిటేషన్ సెక్రెటరీలు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నా రు.



## హాస్యనటులు గౌతమ్ రాజుకి ఘన సత్కారం

**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము ఆహ్వానాన్ని మన్నించి శనివారం నాడు సాయంకాలం జోరు వానలు కరెంటు కూడా లేని సమయంలో శ్రీ సీతారామాంజనేయ దేవస్థానానికి విచ్చేసిన హాస్యనటులు గౌతమ్ కి ఆలయ కమిటీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గౌతమ్ రాజు కి చిరు సత్కారాన్ని అందజేసి శ్రీవారి విగ్రహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాముతో పాటు సభ్యులు రాంప్రసాద్, మహేంద్ర, రాజు, పవన్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూముల అన్యాక్రాంతం అరికట్టండి

### - విశ్వహిందూ పరిషత్ ప్రకండా అధ్యక్షులు వీర రాజు



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** పత్తికొండ లోని వివిధ దేవాలయాల భూముల అన్యాక్రాంతం విషయమై విశ్వహిందూ పరిషత్ ప్రకండా అధ్యక్షులు వీర రాజు కర్నూలు అసిస్టెంట్ కమిషనర్ ని కలిసి దేవాలయాలకు సంబంధించి సర్వే నెంబర్లు పూర్తి సమాచారం అసిస్టెంట్ కమిషనర్‌కి తెలియజేసారు. అయన వెంటనే స్పందించి దేవాలయాల భూములకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించి వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటాము అని చెప్పడం జరిగినది ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ ప్రకండా అధ్యక్షులు రామలింగయ్య మరియు ఉపేంద్ర నాయుడు మరియు హిందూ ధార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయ్ గారి పట్ల గర్విస్తున్నాను

## : చెన్నైలో రామ్ చరణ్

**చెన్నై తన పుట్టినిల్లు అంటూ రామ్ చరణ్ భావోద్వేగం**
**దర్శకుడు బుచ్చిబాబు వల్లే సినిమాపై అమితమైన ప్రేమ పెరిగిందన్న చరణ్**
**కెరీర్ పీక్స్‌లో ఉండగా ప్రజాసేవకు వచ్చిన విజయ్‌ను అభినందించిన మెగా హీరో**
**ఏఆర్ రెహమాన్, శివరాజ్‌కుమార్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం అదృష్టమని వ్యాఖ్య**
**కుస్తీ సన్నివేశంలో చేతికి గాయమైందని, దాన్ని బుచ్చిబాబు ఇచ్చిన గిఫ్ట్‌గా భావిస్తానన్న చరణ్**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం ప్రమోషన్ల కోసం చెన్నైలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చెన్నైతో తనకున్న విడదీయరాని బంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తన కెరీర్, కొత్త సినిమా, సహనటులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌పై చేసిన ప్రశంసలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**చెన్నైతో విడదీయరాని బంధం**

చెన్నైకి వచ్చినప్పుడల్లా తనకు మాటలు రావని, ఒకరకమైన భావోద్వేగంలో ఉండిపోతానని రామ్ చరణ్ అన్నారు. "నేను పుట్టింది, పెరిగింది ఇక్కడే. మా అమ్మగారిది కూడా ఈ నగరమే. అందుకే చెన్నైకి వస్తే నా సొంత ఇంటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది. మగధీర, ఆర్‌ఆర్‌ఆర్ వంటి సినిమాల ప్రమోషన్లకు వచ్చినప్పుడు కూడా ఇదే ఫీలింగ్ కలిగింది" అని ఆయన తెలిపారు. వేదికపై ఉన్న ఎందరో లెజెండ్స్ ముందు మాట్లాడటం సంతోషంగా ఉందన్నారు.

**ఇది కష్టం కాదు.. ఇష్టంతో చేసిన సినిమా**

తన కొత్త సినిమా గురించి మాట్లాడుతూ, ఇది ఎంతో ఇష్టపడి, ప్రేమించి చేసిన చిత్రమని చరణ్ స్పష్టం చేశారు. "ఈ సినిమా కోసం మేమంతా రెండున్నరేళ్లుగా దాదాపు 285 రోజులు పనిచేశాం. కానీ మా దర్శకుడు బుచ్చిబాబు మాత్రం గత ఐదారేళ్లుగా ఈ కథపైనే జీవిస్తున్నారు. సుకుమార్ గారు నాకు బుచ్చిబాబు లాంటి అద్భుతమైన రైటర్‌ను పరిచయం చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు. ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ గారు సెంట్రల్ పిల్లర్ లాంటి వారు," అని వివరించారు. షూటింగ్ తర్వాత ప్రతిరోజూ ఇంటికి వెళ్లి సినిమా గురించి ఆపకుండా మాట్లాడేవాడినని, రంగస్థలం, ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత మళ్లీ అంతగా ప్రేమించిన సినిమా ఇదని, ఇది కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**లెజెండ్స్‌పై ప్రశంసల వర్షం**

ఈ చిత్రంలో పనిచేసిన లెజెండ్స్‌ను చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. శివరాజ్‌కుమార్ గురించి మాట్లాడుతూ, "ఆయన స్క్రీన్‌పైకి వస్తే నిప్పుల వర్షం కురిసినట్టు ఉంటుంది. జైలర్ సినిమాలో ఆయన నటన ఐకానిక్" అని కొనియాడారు. సినిమాటోగ్రాఫర్ రత్నవేలుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన విజువల్స్ అద్భుతంగా ఉంటాయని ప్రశంసించారు. జాన్వీ కపూర్ తన నటనతో సినిమాకు కొత్త రంగు అద్దారని, ఆమె ఎంతో సిన్సియర్ నటి అని అన్నారు.

**బుచ్చిబాబు గిఫ్ట్, విజయ్‌కి అభినందనలు**

ఈ సినిమా కోసం మూడు రకాల శారీరక మార్పులకు లోనయ్యానని, అయితే దర్శకుడు బుచ్చిబాబును డీల్ చేయడమే తనకు అతిపెద్ద ఛాలెంజ్‌గా అనిపించిందని చరణ్ చమత్కరించారు. కుస్తీ సన్నివేశాల చిత్రీకరణలో తన చేతికి గాయమైందని, దానిని బుచ్చిబాబు తనకు ఇచ్చిన అందమైన బహుమతిగా భావిస్తున్నానని నవ్వుతూ చెప్పారు. అనంతరం తమిళనాడు సీఎం విజయ్ గురించి మాట్లాడుతూ, "కెరీర్ శిఖర స్థాయిలో ఉన్నప్పుడు, ఇంత స్టార్‌డమ్ ఉన్న సమయంలో వాటన్నింటినీ వదిలి ప్రజాసేవ కోసం ముందుకు రావడం స్ఫూర్తిదాయకం. ఒక ఫిల్మ్ ఇండస్ట్రీ వ్యక్తిగా ఆయనను చూసి గర్వపడుతున్నాను" అని రామ్ చరణ్ అభినందనలు తెలిపారు. ్లలకు కూడా స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని, తన లైబ్రరీలో జీవితాంతం గుర్తుండిపోయే చిత్రం అని తెలిపారు.

# 'సేవ్ ది టైగర్స్ 3' ట్రైలర్ విడుదల.. నవ్వుల సునామీ పక్కా!

- సేవ్ ది టైగర్స్ 3' సిరీస్ ట్రైలర్ విడుదల
- జూన్ 19 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్
- ఈసారి కథలో ఫాంటసీ టచ్.. ఇంద్రుడిగా వెన్నెల కిషోర్
- ఎమ్మెల్యే, సీఈవోలుగా మారిన స్నేహితుల బృందం
- వినోదాన్ని రెట్టింపు చేసేలా సరికొత్త కథనం



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. "పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు" అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. "మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా" అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షమవడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది. ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి. ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది. ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.



# టైటిల్ వేటకు సై

- రెండో టైటిల్‌పై ఇరు జట్ల గురి
- బెంగళూరుతో గుజరాత్ ఢీ
- రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఐపీఎల్19 అంతిమ సమరానికి రంగం సిద్ధం. డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఆతిథ్య జట్టు గుజరాత్ టైటాన్స్ రెండో టైటిలే లక్ష్యంగా నేడు బరిలోకి దిగుతున్నాయి. గత సీజన్లో ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన ఆత్మవిశ్వాసంతో ఆర్సీబీ, సొంతగడ్డ అనుకూలతతో టైటాన్స్ విజయంపై దీమాగా ఉన్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ టైటిల్ పోరు నేడు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)19 సీజన్లో అత్యుత్తమ జట్లు టైటిల్ పోరుకు సై అంటున్నాయి. ఒకరిద్దరి ప్రదర్శనపై ఎక్కువగా ఆధారపడకుండా సమిష్టిగా రాణిస్తూ.. ఫైనల్‌కు చేరుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ నేడు అంతిమ సమరంలో తాడోపేడో తేల్చుకోనున్నాయి. తొలి టైటిల్ కోసం 18 ఏండ్లు ఎదురుచూసిన బెంగళూరు.. వరుసగా రెండో టైటిల్‌పై కన్నేయగా.. ఐదేండ్లలో మూడోసారి ఫైనల్‌కు చేరుకున్న గుజరాత్ టైటాన్స్ సైతం రెండో టైటిల్‌పై ఆశలు పెట్టుకుంది. గత ఎనిమిది సీజన్లుగా క్వాలిఫయర్1లో నెగ్గిన జట్టునే ఐపీఎల్ ట్రోఫీ వరిస్తోంది. మరి నేడు ఫైనల్లో ఆ సంప్రదాయం కొనసాగుతుందా టైటాన్స్ ఆ రికార్డును బ్రేక్ చేస్తుంద ఆసక్తికరం.

**జోరుమీదున్న ఆర్సీబీ**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు భీకర ఫామ్‌లో ఉంది. దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, వెంకటేశ్ అయ్యర్ విధ్వంసక ఇన్నింగ్స్‌లతో కదం తొక్కుతుండగా.. విరాట్ కోహ్లి నిలకడగా రాణిస్తున్నాడు. భారీ స్కోర్లు నమోదు



చేయటం, భారీ లక్ష్యం ఛేదించటం ఆర్సీబీకి వెన్నతో పెట్టిన విద్య!. బలమైన బ్యాటింగ్ లైనప్‌కు బలమైన బౌలింగ్ దళం ఆర్సీబీ అతిపెద్ద బలం. భువనేశ్వర్ కుమార్, హాజిల్‌వుడ్ పవర్‌ప్లేలో, డెత్ ఓవర్లలో గొప్పగా రాణిస్తున్నారు. కృనాల్ పాండ్య, సుయాశ్ శర్మలు మాయ చేసేస్తున్నారు. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణిస్తే ఆర్సీబీ వరుసగా రెండో సీజన్లో ఐపీఎల్ చాంపియన్‌గా నిలువటం లాంఛనమే.

**ఆశల పల్లకిలో టైటాన్స్**

గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్1లో ఓడినా.. అహ్మదాబాద్ వేదికగా లీగ్ మ్యాచ్‌లో బెంగళూరును 155 పరుగులకే పరిమితం చేసి గెలుపొందింది. సొంతగడ్డపై టైటాన్స్‌కు తిరుగులేని రికార్డుంది. టైటాన్స్ పేసర్లు కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ త్రయం గొప్పగా రాణిస్తున్నారు. రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. సొంతగడ్డపై బౌలర్లు మెరిస్తే టైటాన్స్‌కు తిరుగుండదు. బ్యాట్‌తో శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, జోశ్ బట్లర్, వాషింగ్టన్ సుందర్ టైటాన్స్‌కు కీలకం కానున్నారు. భారీ లక్ష్యాలను ఛేదించటంలో టైటాన్స్‌కు మంచి రికార్డు లేదు. క్వాలిఫయర్1 ప్రదర్శన పునరావృతం చేయాలని ఆర్సీబీ చూస్తుండగా.. లీగ్ మ్యాచ్ ప్రదర్శన పునరావృతంపై టైటాన్స్ ఆశలు పెట్టుకుంది.

**పిచ్, వాతావరణం**

గత సీజన్ ఐపీఎల్ ఫైనల్ సైతం అహ్మదా బాద్‌లోనే జరిగింది. నిరుడు టైటిల్ పోరుకు ఉపయోగించిన పిచ్‌నే నేటి మ్యాచ్‌కు సిద్ధం చేశారు. ఇదే పిచ్‌పై లీగ్ దశలో టైటాన్స్ చేతిలో ఆర్సీబీ ఓటమి పాలైంది. ఈ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ అనుకూలం. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఎక్కువ. ఫైనల్ మ్యాచ్‌కు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. వర్షం సూచనలు లేవని సమాచారం.

**తుది జట్లు (అంచనా)**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు : విరాట్ కోహ్లి, వెంకటేశ్ అయ్యర్/ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), కృనాల్ పాండ్య, టిమ్ డెవిడ్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రోమారియో షెఫర్డ్, భువనేశ్వర్ కుమార్, జోశ్ హాజిల్‌వుడ్, రసిఖ్ సలాం, జాకబ్ డఫ్ఫీ.

గుజరాత్ టైటాన్స్ : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), బి. సాయి సుదర్శన్, జోశ్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, నిశాంత్ సింధు, జేసన్ హోల్డర్, రాహుల్ తెవాటియ, రషీద్ ఖాన్, ఆర్. సాయి కిశోర్, కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ.



# ఫైనల్లో సాత్విక్ జోడీ

- వరల్డ్ నం.1 జోడీపై సెమీస్‌లో గెలుపు
- సింగపూర్ ఓపెన్ సూపర్ 750

**సింగపూర్ :** భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ ఈ ఏడాది వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో రెండోసారి ఫైనల్‌కు చేరుకున్నారు. థాయ్‌లాండ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్,చిరాగ్‌లు శనివారం సింగపూర్‌లో జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో వరల్డ్ నం.1 దక్షిణ కొరియా షట్లర్లు కిమ్, సియోలపై వరుస గేముల్లో గెలుపొంది సింగపూర్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించారు. 52 నిమిషాల్లోనే ముగిసిన సెమీఫైనల్ సమరంలో సాత్విక్,చిరాగ్‌లు 21-19, 21-18తో మెప్పించారు. వరల్డ్ నం.1 దక్షిణ కొరియా జోడీతో మూడు సార్లు తలపడిన సాత్విక్, చిరాగ్‌లు తొలిసారి విజయం సాధించారు. సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్ టైటిల్ పోరుకు చేరుకున్నారు. సెమీఫైనల్ సమరంలో రెండు గేముల్లోనే సాత్విక్, చిరాగ్‌లు లాంఛనం ముగించినా.. రెండు గేముల్లోనూ వరల్డ్ నం.4 భారత జోడీ ఆరంభంలో వెనుకంజ వేసింది. తొలి గేమ్‌లో 8-13, 13-17తో సాత్విక్, చిరాగ్‌లు వెనకబడ్డారు. కానీ ఆఖర్లో పుంజుకుని తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో 11-14తో వెనుకంజ వేసినా.. వరుసగా ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకుని ఆధిక్యంలోకి వచ్చారు. అదే ఊపులో రెండో గేమ్‌ను, ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకున్నారు. 'దక్షిణ కొరియా షట్లర్లు ఉత్తమ డిఫెన్స్ ఆడుతున్నారు. ఎటాకింగ్ గేమ్ ఆడినప్పుడు సంయనం అవసరమని భావించాం. ఆరంభంలో వెనుకబడినా..మా ప్రణాళికకు కట్టుబడి ఉంటే అవకాశం వస్తుందని అనుకున్నామని' సాత్విక్ తెలిపాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో జోడీకి పరాజయం ఎదురైంది. జపాన్ షట్లర్లు యుచి, సయాకల చేతిలో 16-21, 21-17, 13-21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడారు. నేడు జరిగే మెన్స్ డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ మలేషియా షట్లర్లు మథియస్, అలెగ్జాండ్ర బోయెలతో సాత్విక్, చిరాగ్‌లు పోటీపడనున్నారు.

# మంత్రాలయం వద్ద విషాదం..

- తుంగభద్రలో ఐదుగురు గల్లంతు
- మృతుల్లో ఐదేళ్ల బాలుడు, హైదరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు
- సత్యనారాయణ వ్రతం తర్వాత స్నానానికి వెళ్లి ప్రమాదం
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదం నుంచి బయటపడిన అపర్ణ



**కర్నూలు– సూర్య వాస్తవం**

కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

# కబ్జా చేసిన ఇంటి స్థలాన్ని మాకు ఇవ్వండి

**- అధికారులకు జీకే రమణ విజ్ఞప్తి**



**అనంతపురం– సూర్య వాస్తవం**

తాము నివాసం ఉంటున్న ఇంటి స్థలాన్ని దౌర్జన్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన బుడ్డా రెడ్డి గంగన్న అలియాస్ గౌరవ గంగన్న కబ్జా చేశారని అనంతపురం జిల్లా కుందుర్పి మండలం రుద్రం పల్లి గ్రామానికి చెందిన జీకే రమణ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిని దౌర్జన్యంగా ధ్వంసం చేసి కబ్జా చేశారని వాపోయాడు. తమ స్థలాన్ని తమకు తిరిగి ఇప్పించాలని ఆయన ఒక ప్రకటనలో అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు గత 45 సంవత్సరాలుగా సర్వే నంబర్ 142, 145..7 లో 20 సెంటర్లో కొట్టం వేసుకొని, జుట్టు మూల కంచె వేసుకొని నీలగిరి చెట్లను, ఊరు కళ్ళను పెంచుకొని ఉంటూ వచ్చామన్నారు. అయితే అక్కడే కొట్టం వేసుకుని జీవనం సాగిస్తూ వచ్చామన్నారు. అయితే 31..01...2004 సంవత్సరంలో తన భార్య జీకే గోవిందమ్మ పేరుతో 3.50 సెంట్లు స్థలాన్ని ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చిందన్నారు. రుద్రం పల్లి గ్రామంలో నివాసం ఉంటున్న తాము పిల్లల విద్య కోసం 20 ఏళ్ల క్రితం బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర కాలనీలో ఉంటున్నామని రమణ తెలిపారు. బుద్దారెడ్డి గంగన్న కు ఏడాది వయసున్న సందర్భంలో అతని పేరుతో 145..7 సర్వే నంబర్ లో 3.93 స్థలానికి 29..5..1972 లో డి పట్టా ఇచ్చారన్నారు.. అయితే మసాలాపై కన్నేసిన బుడ్డా రెడ్డి గంగన్న 7..6..2025 వ తేదీన దౌర్జన్యంగా మా ఇంటిలో కూల గొట్టించారని జీకే రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాము కుందుర్పి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు.. ఆ ఫిర్యాదు మేరకు ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 34/2025,23-6-2025 న కేసు నమోదు చేశారని తెలిపారు.. జరిగిన విషయాన్ని 16..6..2025 న ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ లకు వినతి పత్రాలు పంపడం జరిగిందన్నారు.. అంతటితో ఆగని బుడ్డా రెడ్డి గంగన్న, ఆయన భార్య, కుమారులు మధు, పురుషోత్తం, తమ్ముడు చంద్రన్న, సుజాత, మనోజ్ లు 9..5..2026 న తనపై దాడి చేసి తన ఇంటి వద్ద ఉన్న బండలను జెసిబి లతో పూర్తిగా తొలగించారని జీకే రామన్న తెలిపారు... మా స్థలాన్ని పూర్తిగా ఆక్రమించారని తెలిపారు.. ఈ మేరకు కుందుర్పి పోలీస్ స్టేషన్లో ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 67/2026 న పోలీసులు కేసు నమోదు చేశారన్నారు... ఈ విషయంలో కబ్జాకు గురైన తమ స్థలాన్ని తమకు ఇప్పించాల్సిందిగా జీకే రామన్న అధికారులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఒంటరినైపోయాను..!

**ఇరాన్ విషయంలో ట్రంప్ వైఖరిపై నెతన్యాహూ కినుక**
**బీటలు వారుతున్న అమెరికా'ఇజ్రాయిల్ స్నేహబంధం**
**శాంతి ఒప్పందంలో దక్కని చోటు**
**జెరుసలేం డిమాండ్లను పట్టించుకోని ట్రంప్**



**జెరుసలేం - సూర్య వాస్తవం:** ఇజ్రాయిల్-అమెరికా దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఏకకాలంలో యుద్ధ విమానాలతో దాడి చేసినప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూలు ఒకరి 'చారిత్రక నిర్ణయా'న్ని మరొకరు ప్రశంసించుకున్నారు. రెండు దేశాల మధ్య స్నేహబంధం ఇంతకుముందు ఎన్నడూ ఇంత బలంగా లేదని నెతన్యాహూ ఇజ్రాయిల్ ప్రజలకు చెప్పారు. కానీ ఇప్పుడు ఆ స్నేహబంధం బీటలు వారినట్లు కన్పిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం మొదలై మూడు నెలలు గడిచిపోయాయి. ఇరాన్' అమెరికా మధ్య పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో దౌత్య యత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటిలో నెతన్యాహూకు ఎలాంటి పాత్ర లేకుండా పోయింది. ఈ ప్రక్రియ నుంచి ఆయనను పూర్తిగా పక్కకు నెట్టేసినట్లే కన్పిస్తోంది.

**శాంతి ఒప్పందంపై కలవరపాటు**

ట్రంప్ చర్యలను నెతన్యాహూ జీర్ణించుకోలేకపోయినప్పటికీ ఆయనను బహిరంగంగా విమర్శించకుండా సంయమనం పాటిస్తున్నారు. అయితే యుద్ధాన్ని ముగించడానికి అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలపై ఇజ్రాయిల్ ఎలాంటి ప్రభావం చూపలేకపోతోందని ఆయన వాపోతున్నారని ఇజ్రాయిల్ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్‌లో కాల్పుల విరమణను ప్రకటించినప్పుడు దానిని నెతన్యాహూ తప్పుపట్టారు. ఇరాన్‌పై నిరంతరం ఒత్తిడి తెచ్చినప్పుడే అది పతనమవుతుందని ఆయన వాదించారు. ఇరాన్‌పై పూర్తి స్థాయిలో సైనిక చర్యను ప్రారంభించాలని ట్రంప్‌పై పదేపదే ఒత్తిడి తెచ్చారు. అయితే వైట్‌హౌస్ మాత్రం దౌత్యం వైపే మొగ్గు చూపింది. అమెరికా-ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇజ్రాయిల్‌కు ఆందోళన కలిగిస్తున్న ఇరాన్ యురేనియం నిల్వలు, దాని బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమం, ప్రాంతీయ ప్రాక్సీ నెట్‌వర్క్ వంటి అంశాలకు ఈ ఒప్పం దం చాలా వరకూ ఎలాం టి పరిష్కారాలు చూపడం లేదని ఆ వర్గాలు చెప్పాయి. ఈ పరిణామం సహజంగానే నెతన్యాహూను కలవరపెడుతోంది.

**అది చెడ్డ ఒప్పందం**

'ట్రంప్ ఒక చెడ్డ మధ్యంతర ఒప్పందం చేసుకో వడం నిజంగా ఆందోళన కలిగి స్తోంది. ఇరాన్ తన వద్ద ఉన్న యురే నియ నిల్వలను తొలగిస్తే మంచిదే. కానీ అది కేవలం ప్రకటనకే పరిమితమైతే ఇరాని యన్లు అమెరికన్లను మభ్యపెట్టి చివరికి యురేనియం నిల్వలను తొలగించకపోవచ్చు' అని ఇజ్రాయిల్ అధికారి ఒకరు సీఎనఎన్ వార్తా సంస్థతో అన్నారు. అమెరికాతో ప్రస్తుతం జరుగుతున్న చర్చలలో యురేనియం నిల్వల తొలగింపు ప్రస్తావనే లేదని ఇరాన్ పదేపదే చెబుతోంది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అమెరికాకు ఇరాన్ అప్పగించాలని చెబుతూ వచ్చిన ట్రంప్ తాజాగా కొంత వెసులుబాటును సూచించారు. ట్రంప్ తాజా వైఖరి అణ్వాయుధాల తయారీకి ఇరాన్‌కు దారి చూపుతుందని ఇజ్రాయిల్ ఆందోళన చెందుతోంది.

**చర్చల్లో ప్రతినిధులపై ఆగ్రహం**

లెబనాన్‌లో కాల్పుల విరమణ పాటించాలని, దానిని ఒప్పందంలో చేర్చాలని ఇరాన్ పట్టుపట్టడం ఇజ్రాయిల్‌కు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఇజ్రాయిల్ దూకుడుకు అమెరికా ఇప్పటికే కళ్లెం వేసింది. ఇజ్రాయిల్ దళాలపై, ఉత్తర సరిహద్దు ప్రాంతాలపై హెజ్బొల్లా డ్రోన్ దాడులను ఉధృతం చేసింది. లెబనాన్‌పై చర్యలను తీవ్రతరం చేయాలని నెతన్యాహూ ఇటీవల తన సైన్యాన్ని ఆదేశించారు. ఆయన రాజకీయ ప్రత్యర్థులు, మిత్రపక్షాలు సైతం సైనిక చర్యకు మద్దతు తెలిపాయి. అయితే ట్రంప్ ఒత్తిడికి నెతన్యాహూ తలవంచడాన్ని ఆ పార్టీలు తప్పుపడుతున్నాయి. ట్రంప్‌ను చర్చల ప్రతినిధులు జేర్డ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ తప్పుదోవ పట్టించి దౌత్యం వైపు లాగుతున్నారని నెతన్యాహూ ఆరోపిస్తున్నారు. నెతన్యాహూ అనుకూల మీడియాలో చర్చల ప్రతినిధులకు వ్యతిరేకంగా కథనాలు వండి వారుస్తున్నారు. నెతన్యాహూ ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ట్రంప్ రంగంలోకి దిగారు. ఇజ్రాయిల్‌తో సంబంధాలను నెలకొల్పుకోవాలని, అబ్రహం ఒప్పందాలలో చేరాలని సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలను ఆయన కోరారు. అయితే వాటి నుంచి సానుకూల స్పందన రాలేదు.

**ట్రంప్ మమ్మల్ని బలిపశువును చేశారు**

ఇరాన్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి దాని చమురు కేంద్రాలపై పెద్ద ఎత్తున దాడి చేయాలని అమెరికాపై నెతన్యాహూ ఒత్తిడి తెస్తున్నారు. 'ఇరాన్ ఓడరేవులపై అమెరికా కనుక దిగ్బంధాన్ని ఎత్తివేస్తే...అది చెడ్డ ఒప్పందంలో భాగమైతే...ఘోరం జరిగిపోతుంది. ఇరాన్ బలోపేతమవుతుంది' అని ఇజ్రాయిల్ అధికారి చెప్పారు. ఈ ఒప్పందం సైనికులకు, పోలీసులకు జీతాలు చెల్లించలేని స్థితికి ఇరాన్‌ను తీసుకురావడానికి బదులు దానికి నిధులు అందించి ఆర్థికంగా పుంజుకునేందుకు సాయపడుతుందని వాపోయారు. 'ట్రంప్ మమ్మల్ని బలిపశువులను చేశారు. ఇంతకంటే పరిస్థితి ఇంకెలా ఉంటుంది' అని కొందరు మండిపడుతున్నారు.



# పీఎం సేతు పథకం అమలులో ఏపీ ఫస్ట్..

- విశాఖ ఐటీఐ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం
- పీఎం సేతు పథకం అమలులో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్
- విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం
- ఆర్సెలర్ మిట్టల్, నామ్‌టెక్ భాగస్వామ్యంతో ఐటీఐల ఆధునికీకరణ
- పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం
- దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను అభివృద్ధి చేసేందుకు రూ. 60,000 కోట్ల పథకం

**అమరావతి - సూర్య వాస్తవం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్ (పీఎం-సేతు) పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ పథకం కింద విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ స్టీరింగ్ కమిటీ (చీూజ) ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా పీఎం-సేతు కింద ఆమోదం పొందిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. ప్రముఖ ఉక్కు తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా , న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్)తో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలను 'హబ్ అండ్ స్పోక్' నమూనాలో ఆధునికీకరిస్తారు. పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక శిక్షణ అందిస్తారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 60,000 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించింది. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం మొదటగా ప్రారంభం కానుండటంతో, ఇది ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నారంటూ ప్రచారం
- నిరసనలకు దిగిన ఎంప్లాయిస్ యూనియన్
- ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో వైసీపీ కూడా పాల్గొంది. మరోవైపు, ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )